CELEBRATING 11TH YEAR ANNIVERSARY
ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — PEN POWER TELUGU DAILY — ప్రశ్నించడం మన హక్కు


సంపుటి : 1 సంచిక : 113 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఒంగోలు | సోమవారం 29 డిసెంబర్ 2025 | వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :113 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : ONGOLE | MON 29 DECEMBER 2025 | PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## భారత్‌కు భయపడి బంకర్లో దాసుకోమన్నారు

### పాక్ ప్రెసిడెంట్ సంచలన వ్యాఖ్యలు




పెన్ పవర్ డెస్క్:పాకిస్తాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత భీకర దాడులకు భయపడి తనను బంకర్‌లోకి వెళ్లాలని అధికారులు సూచించారని ఆయన షాకింగ్ కామెంట్స్ చేశారు. అందుకు

వివరాలు 2లో..

## త్వరలో తగ్గనున్న కరెంట్ బిల్లులు.. 2026 నుండి కొత్త ధరలు!



పెన్ పవర్ డెస్క్:భారతదేశంలో సామాన్య ప్రజలకు త్వరలోనే కరెంట్ బిల్లుల భారం తగ్గే అవకాశం కనిపిస్తోంది. ఎందుకంటే కేంద్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (CERC) విద్యుత్ ట్రేడింగ్ ఎక్స్ఛేంజీలు వసూలు చేసే చార్జెస్ సమీక్షిస్తోంది. ప్రస్తుతం మన దేశంలో వేర్వేరు విద్యుత్ ఎక్స్ఛేంజీలలో కరెంట్

వివరాలు 2లో..

## నరసాపురం లేస్ క్రాఫ్ట్ పై ప్రధాని మోదీ ప్రశంసలు...

### కృతజ్ఞతలు తెలిపిన సీఎం చంద్రబాబు

- మన్ కీ బాత్‌లో నరసాపురం లేస్ కళను ప్రస్తావించిన ప్రధాని మోదీ
- ప్రధాని ప్రశంసలపై సోషల్ మీడియాలో ధన్యవాదాలు తెలిపిన సీఎం చంద్రబాబు
- ఈ కళను కాపాడుతున్న మహిళల నైపుణ్యాన్ని అభినందించిన సీఎం
- నరసాపురం లేస్‌కు జీఐ ట్యాగ్ లభించిందని గుర్తుచేసిన ప్రధాని
- ఈ కళ ద్వారా లక్ష మంది మహిళలు ఉపాధి పొందుతున్నారని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నరసాపురం లేస్ క్రాఫ్ట్ (కుట్లు అల్లికల కళ)పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. ఆదివారం ప్రసారమైన తన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన ఈ కళ యొక్క ప్రాముఖ్యతను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రధాని ప్రశంసలపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. "నరసాపురం లేస్ కళను ప్రశంసించినందుకు ప్రధాని మోదీ

వివరాలు 2లో..



## ఇన్‌స్టాగ్రామ్‌కు అంతరాయం... యూజర్ల ఇక్కట్లు!

- కొన్ని గంటల పాటు నిలిచిపోయిన ఇన్‌స్టాగ్రామ్ సేవలు
- అమెరికాలో ప్రధానంగా కనిపించిన సాంకేతిక సమస్య
- లాగిన్, కంటెంట్ లోడింగ్‌లో ఇబ్బందులు పడ్డ యూజర్లు
- భారత్‌పై చాలా స్వల్ప ప్రభావం చూపిన ఔటేజ్
- ఇప్పటివరకు స్పందించని మాతృసంస్థ మెటా


పెన్ పవర్ డెస్క్:ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్, మెటా యాజమాన్యంలోని ఇన్‌స్టాగ్రామ్ సేవలకు ఆదివారం కొద్దిసేపు అంతరాయం కలిగింది. ప్రధానంగా అమెరికాలోని యూజర్లు ఈ సమస్యను ఎదుర్కొన్నారు. లాగిన్

వివరాలు 2లో..

## అయోధ్య బాలరాముడ్ని దర్శించుకున్న సీఎం చంద్రబాబు

- అయోధ్య రామజన్మభూమిని సందర్శించిన సీఎం చంద్రబాబు
- బాలరాముడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ముఖ్యమంత్రి
- ఇదొక ప్రశాంతమైన, ఆధ్యాత్మిక అనుభూతి అన్న చంద్రబాబు
- ఆలయ నిర్మాణ విశేషాలను అడిగి తెలుసుకున్న సీఎం





పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం నాడు అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బాలరాముడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యమంత్రి వెంట పలువురు నేతలు ఉన్నారు. దర్శనం అనంతరం ఆలయ నిర్వాహకులు చంద్రబాబుకు ఆలయ నిర్మాణ శైలి, ఇతర విశేషాలను వివరించారు. ఆయన ఆసక్తిగా ఆలయ విశేషాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటన తనకు ఎంతో ప్రశాంతమైన, ఆధ్యాత్మిక అనుభూతిని ఇచ్చిందని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ పర్యటనపై చంద్రబాబు స్పందిస్తూ, "ఈరోజు అయోధ్యలోని దివ్యమైన, అద్భుతమైన శ్రీరామ జన్మభూమి మందిరంలో స్వామివారిని దర్శించుకుని పూజలు చేసుకునే భాగ్యం కలిగింది. మరోసారి ఇక్కడికి రావడం ఎంతో శాంతియుతంగా, ఆధ్యాత్మికంగా అనిపించింది. శ్రీరాముడి విలువలు, ఆదర్శాలు మనందరికీ శాశ్వతమైన పాఠాలు. అవి మనకు ఎల్లప్పుడూ మార్గనిర్దేశం చేస్తూ, స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షిస్తున్నాను" అని తెలిపారు.

అంతకుముందు, బాలరాముడి దర్శనార్థం అయోధ్య చేరుకున్న చంద్రబాబుకు దేవాలయ అధికారులు, ఉత్తరప్రదేశ్ ఎన్డీఏ నాయకులు ఘన స్వాగతం పలికారు.

వివరాలు 2లో..

## ఐఎన్ఎస్ వాఘ్‌షీర్ సబ్ మెరైన్ లో ద్రౌపది ముర్ము




వివరాలు 2లో..

- కల్వరి క్లాస్ సబ్ మెరైన్ లో ప్రయాణించిన రెండో రాష్ట్రపతి
- కర్ణాటకలోని కార్వార్ నౌకాదళ స్థావరంలో జలాంతర్గామిలోకి ఎంట్రీ
- గతంలో భారత రాష్ట్రపతి హోదాలో ఈ సబ్ మెరైన్ లో ప్రయాణించిన అబ్దుల్ కలాం

## వైద్య రంగంలో 2025 ఒక మైలురాయి..

### ప్రపంచాన్ని మార్చేసిన అద్భుత ఆవిష్కరణలు!



- రోగ నిర్ధారణలో కీలకంగా మారిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్
- జన్యు సవరణ చికిత్సలతో అసాధ్యమైన రోగాలకు స్వస్తి
- టెలిమెడిసిన్, డిజిటల్ హెల్త్‌తో ప్రజలకు మరింత చేరువైన వైద్యం
- రోబోటిక్స్, స్మార్ట్ హాస్పిటల్లతో వైద్య సేవల్లో పెను మార్పులు
- శరీరానికి ధరించే పరికరాలతో నిరంతర ఆరోగ్య పర్యవేక్షణ

పెన్ పవర్ డెస్క్:వైద్య ఆరోగ్య రంగ చరిత్రలో 2025 సంవత్సరం ఒక కీలక మలుపుగా నిలిచింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత రోగ నిర్ధారణ నుంచి జన్యు సవరణ చికిత్సల వరకు... డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫామ్‌ల నుంచి స్మార్ట్ హాస్పిటల్ల వరకు ఎన్నో అద్భుత ఆవిష్కరణలు ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా వైద్య సేవలను పునర్నిర్వచించాయి. గూగుల్, ఫిలిప్స్ వంటి టెక్ దిగ్గజాలు, మెడ్‌ట్రానిక్ వంటి వైద్య సాంకేతిక సంస్థలు, ప్రముఖ ఆసుపత్రులు, పరిశోధనా సంస్థల కృషితో ఈ సాంకేతిక విప్లవం సాకారమైంది.

### ఏఐ ఆధారిత రోగ నిర్ధారణలో కొత్త శకం

2025లో వైద్య పరీక్షలు, రోగ నిర్ధారణలో ఏఐ విడదీయరాని భాగమైంది. ముఖ్యంగా రేడియాలజీ విభాగంలో ఎంఆర్ఐ, సీటీ స్కాన్‌ల వంటి ప్రక్రియలను ఏఐ వేగవంతం, కచ్చితత్వం చేసింది.

వివరాలు 2లో..

## కాలిన వాసన ఎక్కడ వస్తోందో మీ మాటల ద్వారానే తెలిసిపోతోంది: ప్రకాశ్ రాజ్ కు విష్ణువర్ధన్ రెడ్డి కౌంటర్

- ప్రకాశ్ రాజ్, విష్ణువర్ధన్ రెడ్డి మధ్య ముదిరిన సోషల్ మీడియా వార్
- ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలతో మొదలైన వివాదం
- ప్రకాశ్ రాజ్‌ను 'అర్బన్ నక్సల్' అంటూ విమర్శించిన బీజేపీ నేత



పెన్ పవర్ డెస్క్:తనపై ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి చేసిన సుదీర్ఘ విమర్శలకు ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ నిన్న ఘాటుగా స్పందించడం తెలిసిందే. '

వివరాలు 2లో..

## హాదీని చంపిన హంతకులు భారత్ కు పారిపోయారు

- హాదీ హత్య కేసు నిందితులు భారత్‌కు పరారీ
- ఈ విషయాన్ని ధృవీకరించిన బంగ్లాదేశ్ పోలీసులు
- మేఘాలయ సరిహద్దు ద్వారా దేశం దాటిన వైనం
- షేక్ హసీనా ప్రభుత్వ పతనంలో హాదీ కీలక పాత్ర
- నిందితులను అప్పగించాలని భారత్‌తో బంగ్లా సంప్రదింపులు



పెన్ పవర్ డెస్క్:బంగ్లాదేశ్‌ను కుదిపేసిన విద్యార్థి ఉద్యమ నేత షరీఫ్ ఉస్మాన్ బిన్ హాదీ హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ఇద్దరు వ్యక్తులు భారత్‌కు పారిపోయినట్లు

వివరాలు 2లో..

## విద్య ఒక్కటే అభివృద్ధికి రాజమార్గం



పెన్ పవర్ డెస్క్: విద్య ఒక్కటే అభివృద్ధికి రాజమార్గమని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. మన దేశానికి గుర్తింపు, కీర్తి ప్రతిష్ఠలు తెచ్చే విద్య, క్రీడలపై యువత ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం పెదమైనవానిలంకలో ఆమె పర్యటించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో యూనియన్ బ్యాంక్ సహకారంతో ఏర్పాటు చేసిన రూ.18 లక్షల విలువైన కంప్యూటర్లు, సైన్స్ ల్యాబ్ తదితర మౌలిక సదుపాయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడారు. తీరప్రాంత యువత ఉన్నత చదువులు చదివి దేశానికి, రాష్ట్రానికి మంచి సేవలు అందించాలని నిర్మలా సీతారామన్ కోరారు. తీర ప్రాంతానికి ఏం కావాలన్నా చేసేందుకు

వివరాలు 2లో..

## అలిపిరి మెట్ల మార్గంలో ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ప్రారంభం



పెన్ పవర్ డెస్క్:అలిపిరి మెట్లమార్గంలో 7వ మైలు వద్ద ప్రాథమిక చికిత్స కేంద్రాన్ని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీవారి దర్శనానికి మెట్ల మార్గంలో వచ్చే భక్తుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని దీన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీని ద్వారా త్వరితగతిన వైద్య సేవలు అందుతాయని చెప్పారు. అనారోగ్యానికి గురై అత్యవసర పరిస్థితులు వచ్చినపుడు ఈ ఫస్ట్ ఎయిడ్

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# అధికారమంటే అదే

ఆంధ్రప్రదేశ్ లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తప్పులనే ఇప్పుడు చంద్రబాబు నాయుడు కూడా చేస్తున్నారు. జగన్ కాంట్రాక్టర్లకు ఈ ప్రభుత్వం కూడా దోచి పెడుతుందని టీడీపీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా నాటి ప్రభుత్వం ఏడిపించినట్లుగానే ఈ ప్రభుత్వం కూడా కాంట్రాక్టర్లను పక్కన పెట్టి నిధులన్నీ అమరావతిలోనే ఖర్చు చేస్తుంది. అమరావతి నిర్మాణానికి, సంక్షేమానికి చేసిన అప్పులు సరిపోతున్నాయంటున్నారు. 2014 నుంచి 2019 వరకూ కాంట్రాక్టు పనులు చేసిన టీడీపీ ముఖ్యమైన కార్యకర్తలకు కూడా ఇప్పటి వరకూ బిల్లులు రాకపోవడంతో వారు నేరుగా సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. అలాగే ఇప్పుడు కూడా రహదారులను పీపీపీ పద్ధతిలో తీసుకు రావడం కూడా విమర్శలకు దారి తీసింది.

**విద్యను దూరం చేసి...**

చంద్రబాబు ప్రారంభించిన అమరావతి నిర్మాణాన్ని ఆపేయడం ద్వారా జగన్ కు నాడు నష్టం జరిగింది. జగన్ మొదలుపెట్టిన మెడికల్ కాలేజీల విషయంలో కూడా చంద్ర బాబుకు కూడా ఇలాగే జరగొచ్చన్నది సోషల్ మీడియాలో వినిపిస్తున్న అనేక కథనాలు స్పష్టం చేస్తున్నాయి. ఎయిడెడ్ విద్యా సంస్థలు మూసేసి పేదలకు నాణ్యమైన విద్య దూరం చేయడంతో పాటు నిర్బంధంగా ప్రైవేట్ విద్యా సంస్థలపై ఆధార పడేలా చేయడంతో ఉన్నత విద్యలో ఫీజు రీఎంబర్స్ మెంట్ రద్దు చేశారన్న విమర్శలను చంద్రబాబు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్నారు. జనం ఏమనుకుంటారో ఆలోచించారా అంటే, నిజమే... కొన్ని ఆలోచించి చేయాల్సిన పనులు కూడా ఉంటాయని చంద్రబాబు గుర్తు పెట్టుకుంటే మంచిదన్న హెచ్చరికలు వినిపిస్తున్నాయి.

**ఉపాధ్యాయుల్లో అసంతృప్తి...**

నాటి జగన్ ప్రభుత్వంలో ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. నాడు ప్రవీణ్ ప్రకాష్ లేనిపోని నిబంధనలు తెచ్చి ఉపాధ్యాయులకు జగన్ ప్రభుత్వాన్ని సక్సెస్ ఫుల్ గా దూరం చేయగలిగారు. ఇప్పుడు విజయరామరాజు కూడా అదే పంథాలో కొనసాగుతున్నారు. ముస్తాబు పేరిట పాఠశాలల్లో విద్యార్థులను శుచిగా, శుభ్రంగా ఉంచడానికి చేయడాన్ని కూడా ఉపాధ్యాయులపై అదనపు భారం పడిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. , ఎయిడెడ్ స్కూల్స్ విషయంలో చాలా పెద్ద తప్పు జరిగింది,అలడే మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రయివేటు వ్యక్తులకు అప్పగించడం కూడా విమర్శలకు దారి తీస్తుంది. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ మీద రగడ జరుగుతున్న తర్వాత ముఖ్యమంత్రికి సరైన ఫీడ్ బ్యాక్ అందడం లేదు అనిపిస్తోంది. వైసీపీ జనంలోకి తీసుకెళ్లడంలో సక్సెస్ అయింది. . ప్రైవేట్ సేవలు అంటే ప్రైవేట్ వ్యక్తులకు లబ్ది కలిగించడం అనే క్లారిటీ అందరికీ వచ్చేసినట్లే కనపించింది. ఏతా వాతా చెప్పేదేంటంటే.. జగన్ కు.. చంద్రబాబుకు పెద్దగా తేడా లేదనిపిస్తోంది.

## కాలిన వాసన ఎక్కడ వస్తోందో మీ మాటల ద్వారానే తెలిసిపోతోంది:

- మొదటి పేజి తరువాయి

'వెంటనే రియాక్ట్ అయ్యారు.. కాలిందా???" అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దీనిపై విష్ణువర్ధన్ రెడ్డి ఇవాళ కౌంటర్ ఇచ్చారు. ప్రకాశ్ రాజ్‌ను 'అర్బన్ నక్సల్' అని సంబోధిస్తూ, ఆయన ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. "కాలిన వాసన ఎక్కడ వస్తుందో మీ మాటల ద్వారానే తెలిసిపోతోంది అర్బన్ నక్సల్ రాజ్ గారూ" అంటూ ఘాటుగా విమర్శలు చేశారు. ఈ మేరకు విష్ణువర్ధన్ రెడ్డి ట్వీట్ చేశారు. మావోయిస్టులు ఎంతో మంది అమాయక గిరిజనులను, పోలీసులను, రాజకీయ నేతలను చంపారని, వారి హత్యలను ప్రకాశ్ రాజ్ ఎప్పుడైనా ప్రశ్నించారా అని నిలదీశారు. అడవి బిడ్డలను ఇన్‌ఫార్మర్ల నెపంతో మావోయిస్టులు హతమారుస్తున్నప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం నక్సల్స్ లొంగిపోయేందుకు ఎన్నో అవకాశాలు కల్పిస్తున్నా, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో పోటీ చేయమని పిలుపునిస్తున్నా.. ఆ విషయాలు తెలియవన్నట్లు ఎందుకు నటిస్తున్నారని ప్రకాశ్ రాజ్ పై మండిపడ్డారు. మీరు కూడా బెంగళూరులో ఎన్నికల్లో పోటీ చేశారు కదా గుర్తుచేశారు. ఆరెస్సెస్ గురించి ప్రకాశ్ రాజ్ ఎందుకు అనుచితంగా మాట్లాడుతున్నారని విష్ణువర్ధన్ రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలోని సీనియర్ నేతలు కూడా ఆరెస్సెస్ గొప్పతనాన్ని కొనియాడుతున్నారని తెలిపారు. "వెలిసిపోయిన ఎర్ర పార్టీల నీడకు వెళ్లి, నాలుగు అబద్ధాలు చెప్పి ఉనికిని కాపాడుకోవడానికే మీ తాపత్రయం. మేం స్పందించి వాస్తవాలు చెబితే మీకు కాలిందా సోదరా?" అని వ్యాఖ్యానించారు. నమ్మిందే నిజమని భావించకుండా, వాస్తవ ప్రపంచంలోకి వచ్చి విషయాలు పరిశీలించి మాట్లాడితే గౌరవం దక్కుతుందని ప్రకాశ్ రాజ్‌కు హితవు పలికారు. అవసరమైతే ఈ విషయాలన్నీ కన్నడంలో కూడా రాస్తానని విష్ణు పేర్కొన్నారు.

# భారత్‌కు భయపడి బంకర్లో దాసుకోమన్నారు

- మొదటి పేజి తరువాయి

తాను ఒప్పుకోలేదని జర్దారీ తెలిపారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఇండియా ఆపరేషన్ సిందూర్ చేపట్టిన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో భాగంగా భారత సైన్యం పాకిస్తాన్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి మరీ దాడులు చేసి మన సత్తా ఏంటో చూపింది. ఇండియా భీకరంగా దాడులు చేయడంతో పాకిస్తాన్ అగ్ర నాయకత్వం భయంతో వణికిపోయింది.ఆ దేశ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్?తో పాటు పలువురు ప్రాణ భయంతో బంకర్లలో తలదాచుకున్నారు. ఈ క్రమంలోనే ఆ దేశ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీని కూడా బంకర్‌లోకి వెళ్లాలని అధికారులు సూచించారు. కానీ ఆయన అందుకు ఒప్పులేదు. ఈ విషయాన్ని స్వయంగా ఆయనే అంగీకరించారు. ) ఒక బహిరంగ కార్యక్రమంలో ఆసిఫ్ అలీ జర్దారీ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆత్మ రక్షణ కోసం బంకర్?లోకి వెళ్లాలని నా సైనిక కార్యదర్శి సూచించారు. కానీ బంకర్?లోకి వెళ్లేందుకు తాను ఒప్పుకోలేదన్నారు. ధైర్యం గల నాయకులు బంకర్లలో చనిపోరని.. యుద్ధభూమిలోనే చనిపోతారని ఆయన అన్నారు. జర్దారీ అంగీకారంతో ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ అగ్ర నాయకత్వం ఏ విధంగా భయంతో వణికిపోయిందో స్పష్టం చేస్తోంది. జర్దారీ కంటే ముందు పాక్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్?లో భాగంగా ఇండియా చేసిన దాడుల్లో తమకు నష్టం వాటిల్లినట్లు ఆయన అంగీకరించారు. భారత క్షిపణి దాడుల్లో నూర్ ఖాన్ ఎయిర్ బేస్ ధ్వంసమైనట్లు ఆయన బహిరంగంగా ఒప్పుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పాక్ నేతలు ఇండియా దాడులను బహిరంగంగా అంగీకరించడం గమనార్హం.

## ఐఎన్ఎస్ వాఘ్‌షీర్ సబ్ మెరైన్ లో ద్రౌపది ముర్ము

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ రోజు ఉదయం నౌకాదళ జలాంతర్గామిలో ప్రయాణించారు. కర్ణాటకలోని కార్వార్ నౌకాదళ స్థావరానికి చేరుకున్న రాష్ట్రపతి.. నేవీకి చెందిన కల్వరి క్లాస్ సబ్ మెరైన్ 'ఐఎన్ఎస్ వాఘ్‌షీర్' లో ప్రయాణించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వెంట నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె. త్రిపాఠి కూడా ఉన్నారు. కల్వరి క్లాస్ సబ్‌మెరైన్ లో ప్రయాణించిన రెండో రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము నిలిచారు. గతంలో అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా ఉన్న సమయంలో కల్వరి క్లాస్ సబ్‌మెరైన్ లో ప్రయాణించారు. ఇదిలా ఉండగా, ద్రౌపది ముర్ము ఇటీవల హర్యానాలోని అంబాలా ఎయిర్ ఫోర్స్ స్టేషన్ ను సందర్శించిన విషయం తెలిసిందే. అక్కడ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానం రఫేల్ లో ఆమె ప్రయాణించారు.

## విద్య ఒక్కటే అభివృద్ధికి రాజమార్గం

- మొదటి పేజి తరువాయి

సిద్ధంగా ఉన్నామని.. విద్యార్థులు బాగా చదవాలని సూచించారు. మంచి ఆలోచనలతో ముందుకెళ్తూ.. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ప్రధాని మోదీ నిర్వహించిన 'మన్‌కీ బాత్' కార్యక్రమాన్ని నిర్మలా సీతారామన్, ఇతర నేతలు, అధికారులు వీక్షించారు.

# నరసాపురం లేస్ క్రాఫ్ట్ పై ప్రధాని మోదీ ప్రశంసలు...

- మొదటి పేజి తరువాయి

గారికి ధన్యవాదాలు. తరతరాలుగా కుటుంబాలు, సంఘాలు కాపాడుకుంటున్న అనేక సంప్రదాయ కళలకు ఆంధ్రప్రదేశ్ నిలయం. నరసాపురంలో పుట్టిన క్రోచెట్ లేస్ తయారీ అటువంటి అద్భుతమైన కళారూపం" అని పేర్కొన్నారు. ఈ కళను కాపాడటమే కాకుండా, ప్రపంచానికి పరిచయం చేస్తున్న మహిళల నైపుణ్యాన్ని, అంకితభావాన్ని మనస్ఫూర్తిగా అభినంది స్తున్నానని తెలిపారు. ఈ కళకు, కళాకారులకు ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చారు. అంతకుముందు తన ప్రసంగంలో ప్రధాని మోదీ, సంప్రదాయ కళలు సమాజానికి సాధికారత కల్పించడంతో పాటు ఆర్థిక ప్రగతికి ముఖ్యమైన సాధనంగా నిలుస్తాయని అన్నారు. "ఆంధ్రప్రదేశ్‌లోని నరసాపురం లేస్ కళ ఇప్పుడు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతోంది. తరతరాలుగా ఈ కళ మహిళల చేతుల్లోనే భద్రంగా ఉంది" అని కొనియాడారు. ఈ కళను ప్రోత్సహించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నాబార్డ్ కలిసి పనిచేస్తున్నాయని, కళాకారులకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నాయని ప్రధాని వివరించారు. నరసాపురం లేస్‌కు జీఐ ట్యాగ్ కూడా లభించిందని గుర్తుచేశారు. దీని ద్వారా 500కు పైగా ఉత్పత్తులు తయారవుతున్నాయని, 250 గ్రామాల్లో దాదాపు లక్ష మంది మహిళలు ఉపాధి పొందుతున్నారని ప్రధాని తన ప్రసంగంలో పేర్కొన్నారు.

## హాదీని చంపిన హంతకులు భారత్ కు పారిపోయారు

- మొదటి పేజి తరువాయి

బంగ్లాదేశ్ పోలీసులు అధికారికంగా ప్రకటించారు. ఢాకా మెట్రోపాలిటన్ పోలీసులు (డీఎంపీ) ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు.ప్రధాన నిందితులు ఫైసల్ కరీం మసూద్, అలంగీర్ షేక్‌లు మేఘాలయలోని తురా నగరంలో తలదాచుకున్నట్లు గుర్తించామని అదనపు పోలీస్ కమిషనర్ నజ్రుల్ ఇస్లాం తెలిపారు. సహచరుల సాయంతో వారు హలువాఘాట్ సరిహద్దు ద్వారా మేఘాలయలోకి ప్రవేశించారని వివరించారు. అక్కడ వారికి 'పూర్తీ, 'సమి' అనే ఇద్దరు వ్యక్తులు ఆశ్రయం కల్పించారని, వారిని భారత భద్రతా దళాలు అదుపులోకి తీసుకున్నట్లు తమకు అనధికారిక సమాచారం ఉందని పేర్కొన్నారు. నిందితులను అరెస్ట్ చేసి తమకు అప్పగించాలని అధికారిక, అనధికారిక మార్గాల ద్వారా భారత అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

గత ఏడాది జులై-ఆగస్టులో జరిగిన విద్యార్థి ఉద్యమంలో హాదీ కీలక పాత్ర పోషించారు. షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వ పతనానికి ఈ ఉద్యమమే కారణమైంది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 12న ఢాకాలో ఎన్నికల ప్రచారం చేస్తుండగా, రిక్షాలో వెళుతున్న హాదీపై దుండగులు అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. తీవ్రంగా గాయపడిన హాదీ, సింగపూర్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ డిసెంబర్ 18న కన్నుమూశారు.ఈ హత్య కేసులో ఇప్పటివరకు 11 మందిని అరెస్ట్ చేశామని, వారిలో ఆరుగురు నేరాన్ని అంగీకరించారని పోలీసులు తెలిపారు. మరో 7 నుంచి 10 రోజుల్లో ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని వెల్లడించారు.

# త్వరలో తగ్గనున్న కరెంట్ బిల్లులు.. 2026 నుండి కొత్త ధరలు!

- మొదటి పేజి తరువాయి

ధరలు వేర్వేరుగా ఉన్నాయి. కానీ జనవరి 2026 నుండి అమల్లోకి రానున్న 'మార్కెట్ కప్లింగ్' విధానం ద్వారా అన్ని ఎక్స్ఛేంజీలలో బిడ్లను కలిపి ఒకే ధరను నిర్ణయిస్తారు. దీనివల్ల కరెంట్ ధరలు ఒకే విధంగా ఉండటమే కాకుండా కొంతవరకు తగ్గే అవకాశం ఉంది. కరెంట్ ట్రేడింగ్ సమయంలో వసూలు చేసే చార్జెస్ (Transaction Fees) కూడా తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం యూనిట్‌కు 2 పైసలుగా ఉన్న ఈ ఫీజును 1.5 పైసలకు లేదా 1.25 పైసలకు తగ్గించేలా సమీక్ష జరుగుతోంది. దీని ద్వారా  కోట్ల యూనిట్ల వ్యాపారం జరిగేటప్పుడు భారీ మొత్తంలో ఆదా అవుతుంది. దీని వల్ల విద్యుత్ వినియోగదారులకు  కలిగే ప్రయోజనం ఏంటంటే విద్యుత్ పంపిణీ సంస్థలు (%ణఅంఎశీఎం%) తక్కువ ధరకే విద్యుత్తును కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. కంపెనీలకు ఖర్చు తగ్గితే ఆ ప్రయోజనం నేరుగా సామాన్య వినియోగదారులకు చేరుతుంది. అంటే మీ ప్రతినెల కరెంట్ బిల్లు తగ్గుతుంది. ఇంకా

ధరలు అందరికీ అందుబాటులో ఉండటం వల్ల విద్యుత్ సప్లయ్ లో నాణ్యత పెరుగుతుంది.

గత పదేళ్లలో భారతదేశంలో విద్యుత్ వ్యాపారం 16 రెట్లు పెరిగింది. 2023-24 నాటికి 120 బిలియన్ యూనిట్లను దాటింది. ఇంత పెద్ద మార్కెట్‌లో పారదర్శకత తీసుకురావడం వల్ల భారీ పరిశ్రమలకే కాకుండా సామాన్య ప్రజలకు కూడా మేలు జరుగుతుంది. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ 'వన్ నేషన్ - వన్ ప్రైస్' లాంటి సంస్కరణలు కరెంట్ కష్టాలను తగ్గించడమే కాకుండా ప్రజల జేబుపై భారాన్ని కూడా తగ్గిస్తాయి.

## ఇన్‌స్టాగ్రామ్‌కు అంతరాయం... యూజర్ల ఇక్కట్లు!

- మొదటి పేజి తరువాయి

అవ్వడంలో, యాప్‌లో కంటెంట్ లోడ్ చేయడంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఔటేజ్‌లను ట్రాక్ చేసే వెబ్‌సైట్ 'డౌన్‌డెటెక్టర్' ప్రకారం, అమెరికా కాలమానం ప్రకారం తెల్లవారుజామున 4:10 గంటల సమయంలో సమస్య తీవ్రస్థాయికి చేరింది. ఆ సమయంలో సుమారు 180 మందికి పైగా యూజర్లు ఫిర్యాదులు చేశారు. చాలామందికి యాప్ ఓపెన్ చేసినప్పుడు ఎలాంటి ఎర్రర్ మెసేజ్ చూపించకుండా, కేవలం తెల్లటి స్క్రీన్ మీద రీఫ్రెష్ ఐకాన్ మాత్రమే కనిపించిందని సోషల్ మీడియాలో స్క్రీన్‌షాట్లు పంచుకున్నారు. డౌన్‌డెటెక్టర్ డేటా ప్రకారం, ఫిర్యాదు చేసిన వారిలో 45 శాతం మందికి యాప్‌కు సంబంధించిన సమస్యలు, 41 శాతం మందికి లాగిన్ సమస్యలు ఎదురయ్యాయి. మరో 14 శాతం మంది తమ ఫీడ్ లేదా టైమ్‌లైన్ సరిగ్గా లోడ్ కావడం లేదని తెలిపారు. అయితే, ఈ అంతరాయం ప్రభావం భారత్‌లో చాలా తక్కువగా ఉంది. దేశవ్యాప్తంగా కేవలం 10 మంది యూజర్లు మాత్రమే సమస్యలు ఎదుర్కొన్నట్టు ఫిర్యాదు చేశారని డౌన్‌డెటెక్టర్ పేర్కొంది. దీన్నిబట్టి ఈ సమస్య కొన్ని ప్రాంతాలకే పరిమితమైనట్టు తెలుస్తోంది.

ఈ అంతరాయానికి గల కారణాలపై మాతృసంస్థ మెటా ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

## అలిపిరి మెట్ల మార్గంలో ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ప్రారంభం

- మొదటి పేజి తరువాయి

సెంటర్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. తితిదే, అపోలో వైద్యులతో పాటు శిక్షణ పొందిన పారామెడికల్ బృందం సేవలందిస్తుందని బీఆర్ నాయుడు తెలిపారు. ఈసీజీ యంత్రం, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్, నెబ్యులైజర్‌తో పాటు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరీ తదితరులు పాల్గొన్నారు

# వైద్య రంగంలో 2025 ఒక మైలురాయి..

- మొదటి పేజి తరువాయి

రాయల్ ఫిలిప్స్ సంస్థ ప్రవేశపెట్టిన నూతన స్కానింగ్ వ్యవస్థలు, స్కాన్ ప్రక్రియలో దాదాపు 80 శాతం పనులను ఆటోమేట్ చేస్తూ, పెండింగ్ కేసులను తగ్గించడంలో సహాయపడుతున్నాయి.

సీమెన్స్ హెల్తీనీర్స్ తీసుకొచ్చిన 'ఆప్టిక్ ఏఐ' టెక్నాలజీ, తక్కువ రేడియేషన్‌తోనే అత్యంత స్పష్టమైన చిత్రాలను అందిస్తోంది.

ఇక మెదడు స్కానింగ్‌లను విశ్లేషించే 'రాపిడ్‌ఏఐ' వంటి సాఫ్ట్‌వేర్‌లు, స్ట్రోక్ కేసులను తక్షణమే గుర్తించి, సకాలంలో చికిత్స అందేలా చేస్తున్నాయి. కేవలం కొన్ని చుక్కల రక్తంతో 15 నిమిషాల్లో మెదడు గాయాలను గుర్తించే పోర్టబుల్ టెస్ట్‌ను అబాట్ సంస్థ అందుబాటులోకి తెచ్చింది. దీంతో అనవసరమైన సీటీ స్కాన్‌ల భారం తగ్గింది. అదేవిధంగా, 'లిక్విడ్ బయాప్సీ' టెస్టుల ద్వారా రక్త నమూనాలతోనే, క్యాన్సర్ పునరావృతమయ్యే అవకాశాలను ముందే పసిగట్టడం సాధ్యమైంది. ఇంటి నుంచే గర్భాశయ క్యాన్సర్‌ను పరీక్షించుకునే 'టీల్ వాండ్' వంటి పరికరాలకు ఎఫ్‌డీఏ ఆమోదం లభించడం ఈ ఏడాది మరో ముందడుగు.

**బయోటెక్నాలజీ, వ్యక్తిగత వైద్యం**

ఈ ఏడాది బయోటెక్నాలజీ రంగంలో అద్భుతమైన పురోగతి కనిపించింది. ముఖ్యంగా జన్యు సవరణ ( ) టెక్నాలజీ కొత్త ఆశలు రేపింది. ప్రపంచంలోనే తొలిసారిగా, ఫిలడెల్ఫియా చిన్నపిల్లల ఆసుపత్రి వైద్యులు 'క్రిస్పర్-క్యాస్9' టెక్నాలజీని ఉపయోగించి, అరుదైన జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న ఒక శిశువుకు సంపూర్ణంగా నయం చేశారు. ఇది వ్యక్తిగత వైద్యంలో ఒఒక చారిత్రాత్మక విజయం.సికిల్ సెల్ ఎనీమియా వంటి రక్త సంబంధిత వ్యాధులకు కూడా క్రిస్పర్ ఆధారిత వన్-టైమ్ చికిత్సలు అమెరికా, యూరప్‌లలో ఆమోదం పొందాయి. అయితే, వీటి ఖరీదు ఒక్కో రోగికి సుమారు 2.2 నుంచి 3.1 మిలియన్ డాలర్లు ఉండటం ఆందోళన కలిగించే అంశం.

మరోవైపు, హెచ్ఐవీ నివారణకు సంవత్సరానికి కేవలం రెండుసార్లు తీసుకునే 'లెనకాపావిర్' అనే ఇంజెక్షన్‌కు ఆమోదం లభించింది. ఇది ఎయిడ్స్ రహిత తరాన్ని సాధించే దిశగా ఒక ముఖ్యమైన మైలురాయి. కోవిడ్-19 మహమ్మారి సమయంలో నిరూపించుకున్న ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్ టెక్నాలజీని ఇప్పుడు క్యాన్సర్, ఫ్లూ వంటి ఇతర వ్యాధులపై పోరాటానికి కూడా విస్తరిస్తున్నారు.

**డిజిటల్ హెల్త్, టెలిమెడిసిన్**

డిజిటల్ హెల్త్ టూల్స్, టెలిమెడిసిన్ సేవలు 2025 నాటికి వైద్య రంగంలో సాధారణమైపోయాయి. అమెరికాలోని మేయో క్లినిక్ వంటి ఆసుపత్రులలో 'ఏబ్రిడ్జ్' అనే ఏఐ సిస్టమ్, వైద్యులు-రోగుల సంభాషణలను ఆటోమేటిక్‌గా రికార్డ్ చేసి క్లినికల్ నోట్స్‌గా మారుస్తోంది. దీంతో వైద్యులపై డాక్యుమెంటేషన్ భారం తగ్గి, వారు రోగులపై ఎక్కువ దృష్టి పెట్టగలుగుతున్నారు.

మరోవైపు, ఆన్‌మెడ్ సంస్థ 'కేర్‌స్టేషన్స్' పేరుతో విమానాశ్రయాలు, ఫార్మసీల వంటి బహిరంగ ప్రదేశాల్లో వాక్-ఇన్ టెలిహెల్త్ కియోస్క్‌లను ఏర్పాటు చేసింది. చైనాలో ఏకంగా 256 'ఇంటర్నెట్ హాస్పిటల్స్' ప్రారంభమయ్యాయి. ఇవి ఆన్‌లైన్ కన్సల్టేషన్లు, రిమోట్ మానిటరింగ్ సేవలను అందిస్తున్నాయి.

**వేరబుల్స్, మెడికల్ రోబోటిక్స్**

స్మార్ట్‌వాచ్‌లు, రింగులు, స్కిన్ ప్యాచ్‌ల వంటి ధరించగలిగే పరికరాలు ఇప్పుడు కేవలం ఫిట్‌నెస్ ట్రాకర్‌లుగా కాకుండా, నిరంతర ఆరోగ్య పర్యవేక్షణ సాధనాలుగా మారాయి. రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను ఎప్పటికప్పుడు తెలిపే కంటిన్యూయస్ గ్లూకోజ్ మానిటర్లు , గుండె పనితీరును పర్యవేక్షించే ఈసీజీ ఫీచర్లు, రక్తపోటును కొలిచే ప్యాచ్‌లు, మూర్ఛ వచ్చే ముందు హెచ్చరించే పరికరాలు సర్వసాధారణమయ్యాయి.శస్త్రచికిత్సలలో రోబోటిక్స్ వాడకం మరింత పెరిగింది. 'ఇంట్యూటివ్ సర్జికల్' వారి 'డా విన్సీ' సిస్టమ్‌కు పోటీగా, 'మెడ్‌ట్రానిక్' సంస్థకు చెందిన 'హ్యూగో' రోబోటిక్ సర్జరీ ప్లాట్‌ఫామ్ అనేక దేశాల్లో వినియోగంలోకి వచ్చింది. ఐర్లాండ్‌కు చెందిన 'అకారా' సంస్థ అభివృద్ధి చేసిన 'వయోలెట్' అనే రోబోట్, ఆసుపత్రి గదుల్లో స్వయంగా తిరుగుతూ అతినీలలోహిత కిరణాలతో సూక్ష్మక్రిములను నాశనం చేస్తోంది.

**స్మార్ట్ హాస్పిటళ్లు**

2025లో 'స్మార్ట్ హాస్పిటల్స్' భావన వాస్తవరూపం దాల్చింది. ఈ ఆసుపత్రుల్లోని అన్ని వ్యవస్థలు, ఐఓటీ సెన్సర్లు, ఏఐ టెక్నాలజీలు ఒకదానితో ఒకటి అనుసంధానమై పనిచేస్తాయి. రోగి డిశ్చార్జ్ అయిన తర్వాత కూడా వారి ఆరోగ్యాన్ని వేరబుల్స్ ద్వారా రిమోట్‌గా పర్యవేక్షించడం సాధారణమైంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ  కూడా 'ఈఐఓఎస్ 2.0' అనే ఏఐ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించింది. ఇది ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య ముప్పులను ముందుగానే గుర్తించి హెచ్చరిస్తుంది.టెక్నాలజీ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నప్పటికీ, కొన్ని నైతిక, ఆర్థిక సవాళ్లు కూడా ఉన్నాయి. జన్యు చికిత్సల వంటి అత్యంత ఖరీదైన వైద్యం అందరికీ అందుబాటులో ఉంటుందా అనేది పెద్ద ప్రశ్న. ఏఐ అల్గారిథమ్‌లలో పక్షపాతం, డేటా గోప్యత వంటివి కూడా ఆందోళన కలిగించే అంశాలు. టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందినా, వైద్యంలో మానవ సంబంధాలకు, వైద్యుడి ప్రత్యక్ష పరిశీలనకు ప్రత్యామ్నాయం లేదనేది నిపుణుల అభిప్రాయం. ఏదేమైనా, 2025లో సాధించిన పురోగతి, మానవాళికి మరింత ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించగలదనే బలమైన ఆశను కల్పిస్తోంది. ఈ ఆవిష్కరణల ఫలాలు అందరికీ సమానంగా అందేలా చూడటమే భవిష్యత్ ముందున్న అతిపెద్ద సవాలు.

పెన్ పవర్
ప్రకాశం

# గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

## – 11 కేజీల డ్రై గంజాయి స్వాధీనం

**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలుపెన్ పవర్ డిసెంబర్ 28**

శనివారం రాత్రి బొకారో ఎక్స్‌ప్రెస్ ఒంగోలు రైల్వే స్టేషన్ దాటిన అనంతరం జనరల్ కంపార్ట్‌మెంట్ ముందు భాగంలో సాధారణ తనిఖీలు నిర్వహించగా గంజాయిని గుర్తించారు. నిందితుడు ఆషిక్ తమిళనాడు రాష్ట్రం, నాగపట్టణం జిల్లా నివాసి వద్ద ఉన్న రెండు కాలేజ్ బ్యాగులలో గంజాయి ఉన్నట్లు గుర్తించబడినది. తనిఖీల్లో మొత్తం 11.800 కిలోల డ్రై గంజాయితో పాటు 33 గంజాయి చాక్లెట్ సాచెట్లు స్వాధీనం చేసుకోవడం జరిగింది. వీటి మొత్తం అంచనా విలువ రూ.96,000/-. ఈ తనిఖీలు డి ఎస్ ఆర్ పి రైల్వే సబ్ డివిజన్ జి. మురళి ధర్, ఇన్స్పెక్టర్ షేక్. మౌలా షరీఫ్ ఆదేశాల మేరకు, ఎస్ఐ కె. మధుసూధన రావు, ఆర్‌పీఎస్ సిబ్బంది, ఈగల్ యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్, ఆర్‌పీఎఫ్, సీఐబీ సంయుక్తంగా నిర్వహించారు. నిందితుడిని శనివారం రాత్రి ఒంగోలు రైల్వే స్టేషన్ ఒకటవ నెంబర్ ప్లాట్‌ఫారం వద్ద అరెస్ట్ చేయడం జరిగింది. నిందితుడు విశాఖపట్నం జిల్లా పాడేరు మండలం ప్రాంతం నుంచి గంజాయి తెచ్చి తమిళనాడులో విక్రయిస్తున్నట్లు నిందితుడు అంగీకరించాడు. నిందితుడను రిమాండ్ కు పంపడం జరిగింది.



# మళ్లీ టమోటా ధరలకు రెక్కలు

## రోజురోజుకు పెరిగిపోతున్న టమోటా ధర. ఇబ్బందులు పడుతున్న పేదలు, నిరుపేదలు.

**కొమరోలు పెన్ పవర్ డిసెంబర్ 28.**

గత నెల వరకు అదుపులో ఉంటూ పేద, నిరుపేదలకు, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉంటున్న టమోటా ధరలకు మళ్లీ రెక్కలు వచ్చాయి. గత 15 రోజుల వరకు కూడా కొమరోలు మార్కెట్లో టమోటా కిలో ధర 20 నుంచి 30 రూపాయల వరకు పలుకుతూ వచ్చింది. ఆటోలతో వీధులలో పర్యటిస్తూ కూరగాయల వ్యాపారం చేసే వ్యాపారస్తులు 50 రూపాయలకు మూడు కిలోల చొప్పున కూడా టమోటాలను విక్రయించారు. అయితే గత వారం రోజులుగా టమోటా ధర కు రెక్కలు వచ్చి రోజు రోజుకు ఎగిరిపోతూ పెరుగుతున్నది. గత వారంలో కిలో టమోటా 40 నుంచి 50 రూపాయల వరకు పలికింది. గత రెండు రోజులుగా కొందరు వ్యాపారులు 60 రూపాయలుగా కూడా విక్రయిస్తున్నారు. రాబోవు రోజులలో టమోటా ధర మరింత పెరగ గలదని వ్యాపారస్తులు ప్రచారం చేస్తుండటంతో పేదలు, నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబాల వారు మరింత ఆందోళన చెందుతున్నారు. గత నెలలో సంభవించిన తుఫాను ప్రభావంతో టమోటా పంట పూర్తిగా దెబ్బతిన్నదని, దీనితో రైతులకు టమోటా పంట చేతికి అందక పోవడంతో దిగుబడులు తగ్గిపోయి మార్కెట్లకు సరఫరా తగ్గిపోయిందని, కాగా అరకొరగా ఉన్న టమోటా పంటపై మంచు కురుస్తున్నందువల్ల కాయ దెబ్బతింటున్నదని, ఈ కారణంగా కూడా దిగుబడులు తగ్గి మార్కెట్లకు టమోటా సరఫరా తగ్గిపోవడంతో ధరలు కూడా పెరిగాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. ఇటీవల కొత్తగా సాగుచేసిన టమోటా పంట రైతుల చేతికి అంది మార్కెట్లకు కావలసినంత మేర సరఫరా జరిగితే, ధర కూడా తగ్గుతుందని వారు చెబుతున్నారు. కాగా రైతుల నుంచి వ్యాపారస్తులు నేరుగా టమోటాలు కొనే పరిస్థితులు లేవని, దళారులపై ఆధారపడవలసి వస్తున్నందువల్ల ధరలు కూడా పెరుగుతున్నాయని కూడా పలువురు వ్యాపారస్తులు చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ టమోటా ధరకు రెక్కలు వచ్చి పేద, నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబాల ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.

# నూతన సంవత్సర వేడుకలలో ఉత్సవాలు ఊరేగింపులు నిషేధం

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

### డీఎస్పీ బాలసుబ్రమణ్యం




**కందుకూరు పెన్ పవర్ డిసెంబర్ 28**

నూతన సంవత్సర వేడుకలలో ఉత్సవాలు ఊరేగింపులు నిషేధమని, పోలీసుల సూచనలను విస్మరిస్తే కఠిన చర్యలు తప్పవని డిఎస్పీ బాలసుబ్రమణ్యం హెచ్చరించారు. 31 తేదీ రాత్రి నూతన సంవత్సర వేడుకలు సంబంధించి కందుకూరు సబ్ డివిజన్ లోని కందుకూరు టౌను, కందుకూరు రూరల్, ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం, వలేటివారిపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో అన్ని సెంటర్లలో పికెట్లు ఏర్పాటు, పెట్రోలింగు, డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు ఆదివారం పాత్రికేయుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రోడ్లమీద కేకులు కట్ చేస్తూ, న్యూసెన్స్ క్రియేట్ చేస్తూ ప్రజలకి ఇబ్బంది కలిగించే వారిపై కేసులు నమోదు చేయబడును అని తెలిపారు. రోడ్డు మీదగానీ, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన యడల వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయబడును అని హెచ్చరించారు. ఎవరైనా డిసెంబర్ 31 వ రాత్రి అనుమతి లేకుండా, డీజే లు ఉపయోగించిన, సౌండ్ సిస్టం ఉపయోగించిన వాటిని సీజ్ చేసి, సంబందించిన వారిపై కేసులు నమోదు చేయబడును అని అన్నారు. ఎవరైనా 31వ తేదీ రాత్రి వాహనాలకు సైలెన్సర్ తీసివేసి రైడ్ నిర్వహించిన, నెంబర్ ప్లేట్ లేని వాహనాలను నడిపిన మైనర్స్ వాహనాలను నడిపిన తాగి వాహనాలను నడిపినట్లు అయిన ఆ వాహనాలను సీజ్ చేసి కోర్టు కు పంపడం జరుగుతుంది అని అన్నారు. మైనర్లు వాహనాలను నడిపిన ఎడల వారి వాహనాలను సీజ్ చేసి, వారిపై కేసులు నమోదు చేయబడును. అదేవిధంగా మైనర్ కి వాహనాన్ని ఇచ్చిన వారి పై కూడా కేసులు నమోదు చేయబడును అని అన్నారు. ర్యాష్ డ్రైవింగ్ చేసే వాళ్ళని డ్రోన్ కెమెరా ద్వారా గుర్తించి ఆవాహనాలను కూడా సీజ్ చేసి కోర్టుకు పంపించడం జరుగుతున్నది అని తెలిపారు. నూతన సంవత్సర వేడుకలలో ఎవరైనా అనుమతి లేకుండా బాణ సంచా కాల్చినట్లు అయితే వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది అని తెలిపారు. దేవాలయాలకు, ప్రార్ధన మందిరాలకు వెళ్లేటప్పుడు ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి అని సూచించారు. తల్లిదండ్రులు 31 తేది రాత్రి తమ పిల్లలు ఏం చేస్తున్నారు? ఎక్కడికి వెళుతున్నారు అనేది వారిపై నిఘా ఉంచవలెను అని కోరారు. ఈ కార్యక్రమంలో కందుకూరు, గుడ్లూరు సిఐలు షేక్ అన్వర్ బాషా, మంగారావు, ఎస్సై లు తదితరులు పాల్గొన్నారు.

# బాల చిత్రకారుడికి బంగారు పతకం


**కార్పొరేషన్ పెన్‌పవర్, ఒంగోలు డిసెంబర్ 28**




అమీర్ ఆర్ట్ అకాడమీ, నెల్లూరు టౌన్ హాలులో ఆదివారం నిర్వహించిన 10వ ఆల్ ఇండియా చిల్డ్రన్స్ పెయింటింగ్ కాంపిటేషన్ లో ఒంగోలు కి చెందిన బి.ఆర్ ఒలింపియాడ్ స్కూల్ లో 5వ తరగతి చదువుతున్న తిమ్మిరి షణ్ముగ సింహ కు జాతీయ స్థాయిలో బంగారు పతాకాన్ని సాధించారు. నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయ భాస్కర రెడ్డి , డా! షేక్ అమీర్ జాన్, ఏజిఎం భాస్కర రెడ్డి, అమరావతి కృష్ణా రెడ్డి, కళా రత్న విజయ కుమార్, గిన్నె సాగర్ చేతుల మీదుగా షణ్ముగ సింహ కు అందచేసినట్లు, సృష్టి ఆర్ట్ అకాడమీ కార్యదర్శి డా! తిమ్మిరి రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గత 23 సంవత్సరాలుగా చిత్రకళ బోధనలో, సృష్టి కల్చరల్ సొసైటీ ద్వారా చేస్తున్న ఒంగోలు ఆర్ట్ ఫెస్టివల్ కార్యక్రమాలను అభినందించి నట్లు డా. తిమ్మిరి రవీంద్ర తెలిపారు. ఈ సందర్భంగా పలువురు చిత్రకారులు, పలు సాహితీ సంస్థలు, అభినందించారు.

# ప్రజల సమస్యలపై పోరాడే పత్రిక పెన్ పవర్

## పెన్ పవర్ క్యాలండర్‌ను ఆవిష్కరించిన పోట్ల గోవింద్



**పుల్లల చెరువు పెన్ పవర్ డిసెంబర్ 28**




పుల్లల చెరువు మండల కేంద్రంలో పెన్ పవర్ దినపత్రిక రూపొందించిన పెన్ పవర్ క్యాలండర్‌ను టీడీపీ మండల కన్వీనర్ పోట్ల గోవింద్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోట్ల గోవింద్ మాట్లాడుతూ, పెన్ పవర్ పత్రిక పత్రికా రంగంలో తనదైన శైలితో ముందుకు సాగుతూ, ప్రజల సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తోందని కొనియాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా అడుగులు వేయడంలో పెన్ పవర్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. సమాజంలో మార్పు తీసుకురావడంలో మీడియా పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్న ఆయన, నిజాయితీగా, నిష్పక్షపాతంగా కథనాలు ప్రచురిస్తూ ప్రజల నమ్మకాన్ని సంపాదించుకున్న పెన్ పవర్ పత్రిక భవిష్యత్తులో మరింత ఎత్తుకు చేరాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే పత్రికగా పెన్ పవర్ కొనసాగాలని ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయుడు పాలెం ఎంపీటీసీ పెద్దింటి వెంగయ్య, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ కేశనపల్లి బక్కయ్య, సిపిఐ మండల కార్యదర్శి గురునాథం, సుధాకర్, కాయకోకుల వీరాంజీ, పత్రిక విలేకరులు పాల్గొన్నారు. అనంతరం క్యాలండర్ రూపకల్పనను అందరూ ప్రశంసించారు.

# లక్ష్యాన్ని ఖచ్చితంగా ఛేదించే నైపుణ్యం పొందాలి

### జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు



**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ డిసెంబర్ 28**



పోలీసులు తమ విధుల్లో వినియోగిస్తున్న ఆయుధాల పనితీరుపై పూర్తి స్థాయి పరిజ్ఞానం పెంపొందించుకోవాలని అలాగే ప్రతి బుల్లెట్ లక్ష్యాన్ని ఛేదించే నైపుణ్యం పెంపొందించుకోవాలని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు తెలిపారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఫైరింగ్ సాధన ప్రక్రియలో భాగంగా చీమకుర్తి నందు గల జిల్లా ఫైరింగ్ రేంజ్ లో పోలీసు అధికారులకు నిర్వహించిన వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్ సెషన్ ను ఆదివారం జిల్లా ఎస్పీ గారు సందర్శించి అక్కడ జరుగుతున్న ఫైరింగ్ ప్రక్రియను పరిశీలించి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. కొత్తగా వచ్చిన ఆయుధాలపై పూర్తి స్థాయి తర్ఫీదు పొందుతూ, అత్యవసర పరిస్థితుల్లో ప్రజల, ప్రభుత్వ ఆస్తుల, ధన ప్రాణాల రక్షణకై ఎల్లవేళలా సంసిద్ధులై ఉండాలని సూచించారు. ఫైరింగ్ లో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులను అభినందించి, రివార్డ్స్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దర్శి డీఎస్పీ లక్ష్మి నారాయణ, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ వి. వి.రమణ కుమార్, కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, డిటిసి డిఎస్పీ జి.గురునాథబాబు, ఎఆర్ డిఎస్పీ కె.శ్రీనివాసరావు, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

## – జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు

**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ డిసెంబర్ 28**

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు తెలిపారు. ఈ దిశగా ప్రతి సోమవారం కలెక్టరేట్లో జరిగే ' మీకోసం ' కార్యక్రమంలో ప్రత్యేకముగా ' రెవెన్యూ క్లినిక్ ' ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం నుంచి వచ్చిన మార్గదర్శకాల ప్రకారం ఈనెల 29వ తేదీ నుంచి మీకోసం కార్యక్రమంలో రెవెన్యూ అంశాలకు సంబంధించి వచ్చే అర్జీల పరిష్కారానికి ఐదు ప్రత్యేక టేబుళ్ళు ఏర్పాటు చేస్తారు. ఈ విధంగా ఆర్.ఓ.ఆర్, పాస్ పుస్తకము, ఆర్.ఓ.ఎఫ్.ఆర్, ఏజెన్సీ భూములు, రీ సర్వే టేబుళ్లు ఏర్పాటు చేసి సంబంధిత రికార్డును కూడా అందుబాటులో ఉంచుతారు. రెవెన్యూ క్లినిక్ లో ప్రత్యేకంగా రిసెప్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. అందులోని సిబ్బంది అర్జీదారుతో మాట్లాడి సమస్య ఏమిటో తెలుసుకుని సంబంధిత టేబుల్ వద్దకు అర్జీదారును పంపుతారు. అన్ని పరిశీలించాక భూమి స్వభావము, సమస్య, దాని పరిష్కారానికి చేపట్టే కార్యాచరణ ( ఏ.టి.టి )తో కూడిన రిపోర్టును అర్జీదారుకు అందజేస్తారు. ఒకవేళ సమస్య సివిల్ అంశానికి సంబంధించినది అయితే న్యాయపరమైన సలహా కూడా అందిస్తారు. రెవెన్యూ క్లినిక్ కు వచ్చే తీవ్రమైన అంశాలు, న్యాయపరమైన వ్యవహారాలపై జాయింట్ కలెక్టర్, ఆర్డిఓ, తాసిల్దార్ స్థాయిలో చర్చలు జరిపి పరిష్కారం చూపుతారు. ప్రతిరోజూ ఉదయం కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్ ఈ రెవెన్యూ క్లినిక్ పిటిషన్లపై సమీక్షిస్తారని ఆయన తెలిపారు. క్షేత్రస్థాయి అధికారులు సరైన చర్య తీసుకున్నారని నిర్ధారించుకున్నాకే ఈ పిటిషన్ ను ముగిస్తామని కలెక్టర్ తెలిపారు.



రెవిన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఈ విధంగా ప్రత్యేక దృష్టి సారించినందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# 30న జాబ్ మేళా

**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు డిసెంబర్ 28**

జిల్లా ఉపాధి కార్యాలయం, ఒంగోలు నందు ఈ నెల 30 వ తేదీన (మంగళవారం) ఉదయం 10:00 గం.ల నుండి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె. రమాదేవి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో ఎస్.బి.ఐ కార్డ్స్–ఇన్స్టావ్సోర్స్ టాటా ఎలక్ట్రానిక్స్, స్టాఫ్ క్లౌడ్ సొల్యూషన్స్ కంపెనీ లో ఆర్ఇ, బిఆర్ఇ , టెలికాలర్, టీమ్ లీడర్, బిడిఎం. క్యూఎ, క్యూసి, ఉత్పత్తి, మెషిన్ ఆపరేటర్ బెంచ్ సేల్స్ మేనేజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, రిటైల్ %ఇ% ప్రొడక్షన్ సపోర్ట్, పికింగ్ – ప్యాకింగ్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ సెక్టార్ లలో వివిధ రకాల ఖాళీలను భర్తీచేయుటకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏదైనా విభాగంలో టెన్త్, ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ చదువులు పూర్తి చేసిన వారికి ఇంటర్వ్యూలకు హాజరు కావలసిందిగా కోరారు. ఇంటర్వ్యూ లో ఎంపిక కాబడిన అభ్యర్థులకు జీతం నెలకు 12,000/- నుండి 24,000/- వరకు ప్లస్ పనితీరు ఆధారంగా ఆకర్షణీయమైన ప్రోత్సాహకం ఇవ్వటం జరుగుతుందని ఆమె తెలిపారు. కావున జిల్లాలోని 18సం,, నుండి 35 సం. మధ్య గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ సదవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. ఇంటర్వ్యూ కు ఆధార్ కార్డు సరిఫికేట్స్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని మరిన్ని వివరములకు https://employment.ap.gov.in/ లేదా ఆఫీసు పని సమయాలు 08592 281776లను సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి రమాదేవి తెలిపారు.

# నవోదయలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం




**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ డిసెంబర్ 28**

జవహర్ నవోదయ విద్యాలయం నందు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. నవోదయలో 6 వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు పూర్తి చేసిన వివిధ బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు, వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చి, తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో, విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, తమను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకొని వారి యొక్క తరగతి గదిలో, హాస్టల్ లో జరిగిన అనుభవాలు నెమరు వేసుకున్నారు, ఈ సందర్భంగా, పూర్వ విద్యార్థులు తమ జీవితంలో సాధించిన విజయాలను పంచుకున్నారు. అలాగే పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా విద్యాలయ ప్రిన్సిపాల్ సి. శివరాం హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఈ సమ్మేళనం విద్యార్థుల మధ్య సత్సంబంధాలను పెంచడమే కాకుండా, తమను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన గురువుల పట్ల కృతజ్ఞతను చాటుకునే గొప్ప అవకాశాన్ని కల్పించిందని తెలిపారు. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, నవోదయ విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ డిసెంబర్ 28**

తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తూర్పు నాయుడుపాలెం క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, విద్యా రంగ అభివృద్ధికి తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మన్నం శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చెరుకూరు పూర్ణచంద్రరావు, జిల్లా అధ్యక్షులు అగ్రిబోయిన రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి యనమల ఆంజనేయులు,రెహమాన్,మండ్ల శ్రీనివాస్, తదితర రాష్ట్ర,జిల్లా బాధ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నేడు గార్లదిన్నేలో రైతన్న మీ కోసం కార్యక్రమం

**కొనకనమిట్ల పెన్ పవర్ డిసెంబర్ 28**

మండలంలోని గార్లదిన్నే గ్రామంలో నేడు రైతన్న మీ కోసం కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక టీడీపీ నాయకులు తెలియచేసారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొంటారని,ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందనీ పేర్కొన్నారు.ఈ సందర్భంగా రైతుల సమస్యలపై చర్చించి,ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.కూటమి నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ఏపీ జేఏసీ అమరావతి ఆవిర్భావ మహాజన సభను జయప్రదం చేయండి

## – ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బప్పరాజు వెంకటేశ్వరరావు పిలుపు

**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ డిసెంబర్ 28**

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న ఏపీ జేఏసీ అమరావతి ఆవిర్భావ దినోత్సవాన్ని పెద్ద ఎత్తున జయప్రదం చేయాలని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభలను జయప్రదం చేసేందుకు చేపట్టిన జిల్లాల పర్యటనలో భాగంగా ప్రకాశం జిల్లా ఒంగోలు, ఎన్టీఆర్ కళాక్షేత్రం నందు ఏపీ జేఏసీ అమరావతి ప్రకాశం జిల్లా చైర్మన్ పిన్నిక మధుసూదన్ రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ టివి ఫణి పేరాజు, విఆర్ఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆంజనేయ కుమార్, ఉమెన్ అసోసియేట్ స్టేట్ చైర్ పర్సన్ సైకం శివకుమారి రెడ్డి, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు వి. ఆర్లయ్య, క్లాస్-5 ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షులు మల్లేశ్వరరావు, ఏపీ విఆర్ఓ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ అనుపమ, ప్రకాశం జిల్లా మహిళా చైర్ పర్సన్ ఎన్. జయలక్ష్మి, జనరల్ సెక్రెటరీ ఎన్. శ్రీదేవి, విఆర్ఎ అసోసియేషన్ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రభుత్వరంగ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏపీ జేఏసీ అమరావతి ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఏపీ జేఏసీ అమరావతిలో వ్యక్తుల ప్రాధాన్యత ఉండదని, సంఘాల ద్వారా ఉద్యోగుల సమస్యల పరిష్కరించడం ముఖ్య లక్ష్యమని తెలిపారు. ఏపీ జేఏసీ అమరావతిలో ఉన్న 94 సంఘాలలో, 78 సంఘాలు రాష్ట్రస్థాయిలో, జిల్లా స్థాయిలో ప్రభుత్వానికి ఉద్యోగులకు మధ్య






వారధిలా పనిచేస్తున్నాయని అన్నారు. ఫిబ్రవరి 5వ తేదీన ఏపీ జేఏసీ అమరావతి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన రాష్ట్ర మహాజనసభ కు ఉద్యోగులు వేలాదిగా హాజరై జయప్రదం చేయడం ద్వారా ఉద్యోగుల ఐక్యతను చాటాలన్నారు. అందులో భాగంగానే జిల్లాల పర్యటనలో భాగంగా నేడు ఒంగోలు రావడం జరిగిందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని, నూతనంగా ఏర్పడ్డ కూటమి ప్రభుత్వంలో రెండు సంవత్సరాలుగా అనేక రకాల ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తున్నామని, అందుకు సంబంధించిన కార్యాచరణను రాష్ట్ర మహాజన సభలో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఉద్యోగులకు రావాల్సిన ఐఆర్, పిఆర్సీ, డిఏ, తదితర ఆర్థికపరమైన సమస్యలను ప్రభుత్వం తీర్చే విధంగా మనమందరం ఐక్యతగా ప్రభుత్వానికి తెలియ చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ పిన్నిక మధుసూదన్ రావు, అసోసియేటెడ్ చైర్మన్ కృష్ణమోహన్, ట్రెజరర్ జేపీఎస్ కుమార్, వైస్ చైర్మన్లు బెజవాడ రవి, వి. తిరుపతి స్వామి, వి. ప్రసన్నాంజనేయ కుమార్, వై. వెంకట్రావు, ఆర్. పద్మ, కె. వెంకటేశ్వర్లు, బి. రమేష్ బాబు, సెక్రటరీ జనరల్ ఎస్. పోలయ్య, సెక్రటరీలు పి. శిరీష్ బాబు, అబ్దుల్లా, వై. ప్రశాంత్ నాయుడు, బి. రాజేష్ బాబు, కె. వెంకటేశ్వరరాజు, వైస్ చైర్మన్ ఊతకోలు శ్రీనివాసరావు, సెక్రటరీ కె. శ్రీనివాస వర్మ, వైస్ చైర్మన్ విశ్వరూపాచారి, సెక్రటరీలు కె. జానయ్య, శ్రీనివాసరావు, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్. బాలాజీ, లావణ్య, సుబ్రహ్మణ్యం, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

# నేడు 9 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

## తాటిచెర్ల మోటు సబ్ స్టేషన్ పరిధిలో ఒక గ్రామానికి, చింతలపల్లి ఫీడర్ పరిధిలో 8 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత.

**కొమరోలు పెన్ పవర్ డిసెంబర్ 28**

కొమరోలు మండలంలోని 9 గ్రామాలకు ఈనెల 29వ తేదీ సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లుగా కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. ఆర్ డి ఎస్ ఎస్ పథకం ద్వారా కొత్త లైన్లు ఏర్పాటు కార్యక్రమం సాగుతున్నదని, అందులో భాగంగా ఈనెల 29వ తేదీ సోమవారం తాటిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని నారాయణ పల్లి గ్రామంలో కొత్త లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. ఆ కారణంగా ఆ గ్రామానికి ఈనెల 29వ తేదీ సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయవలసి వస్తున్నదని



ఆయన చెప్పారు ఇక కొమరోలు 33/కేవి సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేజీ చింతలపల్లి ఫీడర్ పరిధిలోని హనుమంతరాయునిపల్లి, కసినేపల్లి ,గోహారపల్లి, కొత్తపల్లి, ఓబులాపురం, కూరాకు వానిపల్లి, చింతలపల్లి, వర్ధనపల్లి గ్రామాలకు కూడా కొత్త లైన్ల ఏర్పాటు కార్యక్రమం కొనసాగుతున్నదని ఆయన చెప్పారు. ఆ కారణంగా సదరు 8 గ్రామాలకు ఈ నెల 29వ తేదీ సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయవలసి వస్తుందని ,కావున విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని ఏఈ శ్రీనివాసులు కోరారు.

# డాక్టర్ కళ్యాణ్‌ను సన్మానించిన ఉడుముల

**మార్కాపురం ఆర్.సి ఇంచార్జ్ పెన్ పవర్ డిసెంబర్ 28**

మార్కాపురం నియోజకవర్గంలో వైద్య రంగానికి విశేష సేవలందిస్తున్న శ్రీ ఆరోగ్య హాస్పిటల్ డాక్టర్ కే. కళ్యాణ్ కుమార్ రెడ్డిని వైసీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ ఉడుముల కోటిరెడ్డి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఉడుముల కోటిరెడ్డి మాట్లాడుతూ మార్కాపురం ప్రాంత ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉన్న వైద్య సేవలు అందించడంలో డాక్టర్ కళ్యాణ్ కుమార్ రెడ్డి చేసిన కృషి అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ఒత్తిడి తగ్గేలా, పేదలు,మధ్యతరగతి ప్రజలకు తక్కువ ఖర్చుతో మెరుగైన చికిత్సలు అందించడం శ్రీ ఆరోగ్య హాస్పిటల్ ప్రత్యేకతగా నిలుస్తోందని పేర్కొన్నారు. కరోనా కాలం నుంచి నేటి వరకు అత్యవసర సేవలు, సాధారణ వైద్య పరీక్షలు, చికిత్సల్లో డాక్టర్ కళ్యాణ్ కుమార్ రెడ్డి నిరంతర సేవలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని, ఇటువంటి వైద్యులను సమాజం గౌరవించాల్సిన అవసరం ఉందని తెలిపారు. డాక్టర్ కే. కళ్యాణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తనకు లభించిన ఈ సన్మానం తనపై మరింత బాధ్యత పెంచిందని,



భవిష్యత్తులో కూడా మార్కాపురం నియోజకవర్గ ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

## రాష్ట్ర మంత్రి బాల వీరాంజనేయ స్వామి



**పొదిలి, పెన్ పవర్, డిసెంబర్ 28**

ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల బాల వీరాంజనేయ స్వామి చెప్పారు. ఆదివారం నాడు ఆయన పొదిలి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి, తనిఖీ జరిపారు. ఈ సందర్భంగా మంత్రి బాల వీరాంజనేయ స్వామి ప్రభుత్వ వైద్యులు, సిబ్బందికి పలు సలహాలు సూచనలు అందించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు ఎక్కువగా పేద ప్రజలే వస్తుంటారని, అందువల్ల వారిపట్ల ప్రత్యేకమైన దృష్టితో వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు. అనంతరం మరిపూడి మండలం లో శనివారం నాడు జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన గుండ్ల సముద్రం గ్రామానికి చెందిన నాగార్జున మృతదేహాన్ని సందర్శించి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, పొదిలి మార్కెట్ కమిటీ చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంస, పట్టణ తెలుగుదేశం నాయకులు ముళ్ళ కుద్దూస్ , రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గునుపూడి భాస్కర్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ రైతు విభాగపు కార్యదర్శి ఆవులూరి ఎల్లమంద, మాజీ ఉపసర్పంచ్ షేక్ జిలాని భాష తో పాటు పలువురు తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటాం

## తెలుగుదేశం యువ నేత విగ్నేష్ రెడ్డి స్పష్టం



**పొదిలి, పెన్ పవర్ డిసెంబర్ 28**

తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి తనయుడు, తెలుగుదేశం యువనేత కందుల విగ్నేష్ రెడ్డి చెప్పారు. ఆదివారం నాడు పొదిలి పట్టణంలో తెలుగుదేశం నాయకులు, మాజీ వార్డు సభ్యులు జ్యోతి మల్లికార్జున నూతనంగా నిర్మించిన గృహాన్ని విగ్నేష్ రెడ్డి సందర్శించారు. అలాగే నూతన గృహం నిర్మించుకున్న మల్లికార్జున ను విజ్ఞేశ్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు దేశం పార్టీ నాయకులు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మ రక్షణకు కరాటే సాధన అవసరం: ఎమ్మెల్యే కందుల






**మార్కాపురం ఆర్.సి ఇంచార్జ్ పెన్ పవర్ డిసెంబర్ 28**

కరాటే వల్ల ఏకాగ్రత, పట్టుదల,మెమరీ పవర్,సాహసం పెరుగుతుందని, ఆత్మరక్షణకు తోడుపడుతుందని మార్కాపురం ఎమ్మెల్యే అందుల నారాయణరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి పట్టణంలోని ఎంఎస్ స్పోర్ట్స్ కరాటే స్కూల్ లో బెల్ట్ గ్రేడ్ టెస్ట్ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. అనంతరం జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రులు చదువుతోపాటు కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడలను ప్రోత్సా హించాలని అన్నారు.చిన్నారులు చిన్న వయసులోనే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వలన మెంటల్ స్టామినా కూడా పెరుగుతుందని అన్నారు.

# అయ్యప్ప స్వాములకు అల్పాహారం విందు





**పెద్దదోర్నాల పెన్ పవర్ డిసెంబర్ 28**

మండల కేంద్రంలోని శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వాములకు అల్పాహారం విందు శనివారం రాత్రి సేఫ్టీ డ్రైవర్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ షేక్షావలి ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయ గురు స్వాములు పొట్టి సాంబశివరావు. కమ్మ వెంకటేశ్వర్లు అలియాస్ పెద్ద పండు. నారాయణ. చల్లా సుబ్బారావు ఆలయంలో భజన కార్యక్రమం నిర్వహించిన అనంతరం అయ్యప్ప స్వాములకు వందమంది భక్తులకు అల్పాహార విందు చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ షరీఫ్. షేక్ చాందు షేక్ మున్నా అలుగుల శీను శీను పండు. కన్నా దాస్. సేఫ్టీ డ్రైవర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఆర్టీసి బస్టాండ్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ డిసెంబర్ 28**

విద్యుత్ మరమ్మత్తులు కారణంగా సోమవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంట కర్నూలు రోడ్డు ,ఆర్ టి సి బస్టాండ్, ఆర్ టి సి బస్టాండ్ ఏరియా,ప్రకాశం హాస్పిటల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలదని టౌన్ విద్యుత్ డి.ఇ.ఇ. కె.వి.పి. రంగారావు తెలియజేశారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## కాకాణిని కలిసిన బద్దిపూడి



**కందుకూరు పెన్ పవర్, డిసెంబర్ 28:**

మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా వైకాపా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి ని పార్టీ ఆఫీస్ లో సాహితి వేత్త డాక్టర్ బద్దిపూడి జయరావు, మర్యాదపూర్వకంగా కలిశారు. జయరావుతోపాటు జిల్లా వైసిపి అధికార ప్రతినిధి ముప్పవరపు కిషోర్, కందుకూరు టౌన్ వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు చనమాల కోటేశ్వరరావు, కందుకూరు వైస్సార్సీపీ నాయకులు వంకాయలపాటి వసంత కుమార్ పుష్పగుచ్చం అందించి దుశ్శాలువాతో సత్కరించి ముందస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్ రెడ్డి కి డాక్టర్.బద్దిపూడి జయరావు రచించిన వర్ణయుద్ధం, ధమనకాండ పుస్తకాలను బహుకరించారు.

## పొదిలిలో యాదాల కోటేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించిన అన్నా రాంబాబు



**పొదిలి, పెన్ పవర్, డిసెంబర్ 28**

పొదిలి పట్టణంలోని వ్యాపారి యాదాల కోటేశ్వరరావు కుటుంబాన్ని మాజీ శాసనసభ్యులు, వైఎస్ఆర్సిపి మార్కాపురం నియోజకవర్గ ఇన్చార్జి అన్న వెంకట రాంబాబు పరామర్శించారు. ఇటీవల యదాల కోటేశ్వరరావు, ఆయన తనయుడు అవినాష్ ను పొదిలి పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ వేమన తీవ్రంగా కొట్టడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న అన్న రాంబాబు ఆదివారం సాయంత్రం పొదిలి పట్టణంలోని యాదాల గృహానికి విచ్చేసి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో అన్నా రాంబాబు వెంట పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు, వైయస్ఆర్సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఆర్టీసి బస్టాండ్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ డిసెంబర్ 28**

విద్యుత్ మరమ్మత్తులు కారణంగా సోమవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంట కర్నూలు రోడ్డు ,ఆర్ టి సి బస్టాండ్, ఆర్ టి సి బస్టాండ్ ఏరియా,ప్రకాశం హాస్పిటల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలదని టౌన్ విద్యుత్ డి.ఇ.ఇ. కె.వి.పి. రంగారావు తెలియజేశారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

# డీజే ల నిషేధం ఉల్లంఘన

## పోలీసులు హెచ్చరికలను పట్టించుకోని నిర్వాహకులు



**కొమరోలు పెన్ పవర్ డిసెంబర్ 28**

గుండె జబ్బులతో బాధపడుతున్న రోగులు, వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని పోలీసులు డిజేల వినియోగాన్ని నిషేధించారు. ఆ మేరకు ఇటీవల గిద్దలూరు సీఐ రామకోటయ్య, కొమరోలు ఎస్సై నాగరాజు డీజే లను నిషేధిస్తున్నట్లుగాను, పోలీసుల నిబంధనలను ఉల్లంఘించి డీజేలు ఏర్పాటు చేసే వారిపై, డీజేల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు కూడా జారీ చేశారు. అయితే ఇటీవల కాలంలో డీజేల వినియోగం కొమరోలు పట్టణంతోపాటు గ్రామాలలో సైతం కొనసాగుతున్నదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల హెచ్చరికలను ఉల్లంఘన పై సర్వత్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి. గత నెలలో ఓ చిరు వ్యాపారి తన వ్యాపార సంస్థ గురించి ప్రచారం చేసేందుకు కొమరోలు పట్టణంలో డీజే లతో పగలే ప్రచార కార్యక్రమంలో నిర్వహించాడు. అంతేకాక వివాహాది శుభకార్యాలు పండుగలు తిరునాళ్లకు డీజే వినియోగం కొనసాగుతున్నట్లుగా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఆదివారం రాత్రి ఒక వివాహ సందర్భంగా నిర్వాహకులు ఆంజనేయస్వామి ఆలయ కూడలి లో గల విఘ్నేశ్వర స్వామిని దర్శించుకుంటూ, ప్రధాన ఆర్ఎంబి రోడ్డుపై డీజేలను అధిక సౌండ్తో ఏర్పాటు చేశారు. దీనితో ఆ చుట్టుపక్కల ప్రజలు, వృద్ధులు, రోగులు ఆందోళన చెంది నిరసన వ్యక్తం చేశారు. గుండె జబ్బులతో బాధపడుతున్న రోగులతో పాటు వృద్ధులు, చిన్నారులు కూడా డీజేల కారణంగా మరింత తీవ్ర అనారోగ్యాలకు గురి అయ్యే ప్రమాదం ఉన్నదని, అందువల్ల డీజే ల పై విధించిన నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## శ్రేయ హాస్పిటల్ ఆధ్వర్యంలో

# ఉచిత వైద్య శిబిరం



**పెద్ద దోర్నాల పెన్ పవర్ డిసెంబర్ 28**

మండలం కేంద్రంలోని శ్రీ రంగ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు వైద్యులు కాశి రావు ఆధ్వర్యంలో ఆదివారం నరసరావు పేట శ్రేయ హాస్పిటల్ మరియు ఐవిఎఫ్ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు హాస్పిటల్ నందు మహిళలకు ఉచితంగా 150 మందికి ఓపీ, స్కానింగ్ లు మరియు పురుషులకు వీర్యకణాల పరీక్షల నిర్వహించారు. ఈ మేరకు శ్రేయ హాస్పిటల్ వైద్యులు వసంత మాట్లాడుతూ మహిళలకు సంతానలేమి సమస్యలు ఈ ప్రాంతం మరియు గ్రామీణ ప్రాంతాల్లో చాలా ఉన్నాయని మా శ్రేయ హాస్పిటల్ మరియు ఐవిఎఫ్ హాస్పిటల్ నుండి ఈ ప్రాంతంలో మరెన్నో సేవలు చేస్తామని అలాగే రంగ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ప్రోత్సాహంతో ఇంకా ఇలాంటి వైద్య శిబిరలు నిర్వహిస్తామని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రేయ హాస్పిటల్ మరియు ఐవిఎఫ్ వైద్య బృందం పాల్గొన్నారు.

## జిల్లా సిమెంట్ అండ్ ఐరన్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు డిసెంబర్ 28**



ఒంగోలు సిమెంటు అండ్ ఐరన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు రోడ్ లోని గోల్డెన్ వెన్యూ హాల్లో ఆదివారం నూతన కమిటీ ఎన్నిక జరిగినది. నూతన కమిటీ జిల్లా అధ్యక్షునిగా కందుల శ్రీనివాసరావు (ఒంగోలు) ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బిజ్జం వెంకట కృష్ణారెడ్డి (అద్దంకి), సెక్రటరీగా కుంచాల శంకర్ (ఒంగోలు), కోశాధికారిగా బొల్లినేని శ్రీనివాసరావు (ఒంగోలు), సంయుక్త కార్యదర్శి మోరా రవిశంకర్ రెడ్డి (కనిగిరి), ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు ఒగ్గిశెట్టి నరసింహం ( పరుచూరు ), బత్తినేని తిరుపతి స్వామి (ఒంగోలు ), బొగ్గవరపు నరసింహారావు (కందుకూరు ), బొంతల వెంకట సుబ్రహ్మణ్యం (పామూరు), యక్కల చెంచయ్య (మార్కాపురం), సాయిన అంజయ్య (ఒంగోలు),గౌరవ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు నిడమానూరి హనుమంతరావు,కార్యవర్గం జిల్లా సిమెంటు ఐరన్ షాపుల ఓనర్స్ పాల్గొన్నారు.

## జగనన్న కాలనీలో మసీదుతో ఇబ్బందులు

### మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు



**కందుకూరు పెన్ పవర్, డిసెంబర్ 28**

పట్టణంలోని టిడ్కో గృహాల సమీపంలో నిర్మించిన జగనన్న కాలనీలో ప్లాట్ నెంబర్ 123 లో మసీదు వల్ల ఇబ్బంది పడుతున్నామని పలువురు తహసిల్దార్, మున్సిపల్ కమిషనర్ కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గతంలో వరాల సాయి నగర్ లో జగనన్న కాలనీలో గృహాలు నిర్మించుకొని నివాసముంటున్నామని అయితే మసీదు వల్ల రోజుకు ఐదుసార్లు మైకుల్లో వచ్చే శబ్దాలు వలన ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఇదే విషయాన్ని వారికి చెప్పగా మా ఇల్లు మా ఇష్టం అని అంటున్నారని వాపోయారు. దీంతో న్యాయం చేయమని రెవిన్యూ అధికారులకు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇప్పటికైనా వారు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

## అల్లూరు పోలేరమ్మకు అష్టలక్ష్మి వెండి బిందెను బహుకరణ

### బహుకరించిన నూకల మురళీకృష్ణ దంపతులు



**మార్కాపురం టౌన్ పెన్ పవర్ డిసెంబర్ 28**

మార్కాపురం గ్రామదేవత శ్రీ అల్లూరు పోలేరమ్మ దేవస్థానంలో అమ్మవారికి అష్టలక్ష్మి వెండి బిందెను భక్తులు బహూకరించారు. హైదరాబాద్ వాసులు నూకల మురళీకృష్ణ - సుజాత దంపతులు రూ.1,24,000 విలువైన వెండి అష్టలక్ష్మి బిందెను దేవస్థానానికి సమర్పించారు. ఈ వెండి బిందెను దేవస్థానం కార్యాల నిర్వహణ అధికారి ఈదుల చెన్నకేశవరెడ్డికి అధికారికంగా అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు దేవులపల్లి పవన్ కుమార్ శర్మ, ఆవుల వెంకటేశ్వర్లు. పాల్గొన్నారు. అలాగే సిబ్బంది వెన్న శ్రీధర్ రెడ్డి, శివ రంగనాయకులు హాజరయ్యారు. భక్తుల సేవాభావానికి ఆలయ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. ఈ తరహా విరాళాలు ఆలయ ఆభరణాలు, పూజా సామగ్రి అభివృద్ధికి ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు.

## నేడు మీకోసం కార్యక్రమం తాత్కాలికంగా రద్దు - జిల్లా ఎస్పీ



**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ డిసెంబర్ 28**

పోలీసుల వార్షిక నేర సమీక్షా సమావేశం జరగనున్న దృష్ట్యా, ప్రకాశం జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించవలసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కావున, ప్రజలు ఈ విషయాన్ని గమనించి, ఫిర్యాదులు చేయుటకు అనవసరమైన వ్యయ ప్రయాసలు పడి జిల్లా పోలీస్ కార్యాలయానికి రావద్దని జిల్లా ఎస్పీ కోరారు.

# మకరజ్యోతి ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ



**నర్సీపట్నం, పెన్ పవర్ (డిసెంబర్ 28) :**నర్సీపట్నంలో ప్రతి ఏటా సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శ్రీస్వామి అయ్యప్ప దేవాలయంలో జరిగే మకరజ్యోతి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం ఉదయం ఆవిష్కరించారు. నర్సీపట్నంలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు స్పీకర్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవాల వివరాలను వివరించారు. ?ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, 1983లో స్థాపించబడిన నర్సీపట్నం శ్రీస్వామి అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. భక్తులందరూ ఈ వేడుకల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఉత్సవాల వివరాలు:

జనవరి 14 నుండి 16 వరకు ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుండి స్వామివారికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు జరుగుతాయన్నారు.

జనవరి 15 (గురువారం): సాయంత్రం 5 గంటలకు కేరళ వాయిద్యాలు, భజన బృందాలతో స్వామివారి రథయాత్ర అంగరంగ వైభవంగా జరుగుతుంది. రాత్రి 7 గంటలకు జాయింట్ కలెక్టర్ మంత్రి మౌర్య భరద్వాజ్, ఐజీ కె. సత్యనారాయణ, సంగీత దర్శకుడు కోటి, గాయకుడు మనో, సినీ నటుడు శ్రీ సత్యసాయి శ్రీనివాస్, సీనిగాయకుడు దొంతం శెట్టి ధీరజ్, మా టివి సింగర్ జీ.వి. శ్రీకీర్తి లకు సన్మానం, శ్రీ గజముఖ నృత్య అకాడమీ వారిచే క్లాసికల్ డ్యాన్స్ ప్రదర్శన ఉంటుంది.

జనవరి 16 (శుక్రవారం): రాత్రి 7 గంటలకు ప్రముఖ సినీ కొరియోగ్రాఫర్ పండు మాస్టర్, పల్సర్ బైక్ ఝాన్సీ, మణికంఠ, రిషిఖ, జబర్దస్త్ మరియు ఢీ-20 ఫేమ్ ఆర్టిస్టులతో బాలు రైడర్స్ ఆధ్వర్యంలో డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం నిర్వహించబడుతుంది.

ఈ మహోత్సవాలను స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులు, టి.డి.పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ దంపతులు, కౌన్సిలర్ చింతకాయల రాజేష్ దంపతులు పర్యవేక్షించనున్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు మరియు అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

## ముక్కోటి ఏకాదశి సందర్భంగా కూరగాయలు వితరణ.

* కోరిబిల్లి కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో హుకుంపేట గ్రామస్తులు సింహాచలం దేవస్థానానికి అందుచేత.



**హుకుంపేట డిసెంబర్ 28:** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం హుకుంపేట మండల కేంద్రానికి చెందిన పలువురు ముక్కోటి ఏకాదశి సందర్భంగా కూరగాయలను. శ్రీ వరాహ నరసింహస్వామి దేవస్థానానికి అందజేశారు ఈ సందర్భంగా కోరుమిల్లి కనకమహాలక్ష్మి మాట్లాడుతూ హుకుంపేట గ్రామ ప్రజలు సహకారంతో ప్రతి ఏడు కూరగాయలు అందజేయడం ఎంతో సంతోషకరమని ఆమె అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుమ్మడికాయలు చింతకాయలు ముల్లంగి క్యాబేజీ. తీదుంపలు. వంటి కూరగాయలు అందజేశామని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో కోరిబిల్లి కనకమహాలక్ష్మి కోరిబిల్లి రామరాజు. బేకరీ గణేష్ బాలు కోత్తా కామరాజు మీసాల గంగరాజు. నీరు బిల్లీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## మహిళలకు చట్టాలు, ఆరోగ్యంపై అవగాహన కల్పించిన ఏయూ ప్రతినిధి




**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,డిసెంబర్ 28:**ఆంధ్ర యూనివర్సిటీ దుర్గాబాయి దేశముఖ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీ సెంటర్‌కు చెందిన రీసెర్చ్ అసిస్టెంట్ చల్లంగి ఉషారాణి గూడెం కొత్త వీధి మండలం మాలిగూడ గ్రామం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు.మహిళలకు అందుబాటులో ఉన్న వివిధ చట్టాలు, హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అలాగే మహిళల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, కుటుంబ ఆరోగ్య సంరక్షణపై సూచనలు చేశారు. ముఖ్యంగా రోజువారీ జీవనశైలిలో పాటించాల్సిన పరిశుభ్రత చర్యలు, ఆరోగ్య సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు మహిళల సామాజిక, ఆరోగ్య అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.

## పిల్లలకు దుస్తులు పంపిణీ చేసిన జనసైనికులు



**నర్సీపట్నం, పెన్ పవర్ (డిసెంబర్ 28) :**నర్సీపట్నం పరిసర ప్రాంతంలోని సుమారు 50 మంది అనాథ పిల్లలకు అవసరమైన దుస్తులను జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన సూర్యచంద్ర పంపిణీ చేశారు. పిల్లలకు కొత్త దుస్తులు అందజేయడంతో పాటు, వారితో మమేకమై వారి చదువు, ఆరోగ్యం, భవిష్యత్‌పై ఆరా తీశారు. వారి సమస్యలను శ్రద్ధగా విని, ఎప్పటికప్పుడు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ సేవాభావమే జనసేన పార్టీ మూల సిద్ధాంతమని, సమాజంలో ప్రతి ఒక్కరూ తన స్థాయికి తగ్గట్టుగా అవసరమైనవారికి సహాయం చేయాలన్నారు. అనాథ పిల్లలు కూడా సమాజంలో గౌరవంగా బ్రతికే హక్కు కలిగి ఉన్నారని, వారి అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి ముందుకు రావాలని కోరారు. ప్రజాసేవే లక్ష్యంగా నిరంతరం కార్యక్రమాలు చేపడుతున్న సూర్యచంద్ర చర్యలు నియోజకవర్గ ప్రజల్లో మంచి స్పందనను రాబట్టాయి. నాయకుడిగా మాత్రమే కాకుండా, ఒక సేవకుడిగా ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని స్థానికులు ప్రశంసలు కురిపించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మాకిరెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ఎంబి.పట్నంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు......



**నాతవరం పెన్ పవర్ (డిసెంబర్ 28):** పేద ప్రజలకు తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట,ఉండడానికి ఇల్లు అనే నినాదంతో పార్టీని స్థాపించి,పేద ప్రజలకు మేలు చేయాలని ఏకైక లక్ష్యంతో,ప్రజా సంక్షేమ లక్ష్యంగా పెట్టుకుని పని చేసిన యుగపురుషుడు స్వర్గీయ నందమూరి తారక రామారావుని ఎంబీ.పట్నం టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు పల్లి బాపన్నాయుడు, గ్రామ టిడిపి సీనియర్ నాయకులు వ్రే తాతబ్బాయి అన్నారు. ఆదివారం ఎంబీ.పట్నం గ్రామంలో వారి మీడియాతో మాట్లాడుతూ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఏర్పాటు చేసి త్వరలో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామని వారు తెలియజేశారు.కుసిరెడ్డి విష్ణుమూర్తి,పల్లి శ్రీనివాసరావు, రాయపురెడ్డి వెంకటరమణ,మామిడి నూకరాజు,వ్రే చరణ్ కుమార్, చింతలపూడి సాంబమూర్తి,పోలుపర్తి రంగబాబు,గాడి వీరన్న, కుసిరెడ్డి దొంగబాబు, నిరుద్యోగి వెంకటరమణ,మందూరి లో సత్యనారాయణ ఆధ్వర్యంలో సుమారు 9 అడుగుల ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి త్వరలో ఘనంగా ప్రారంభోత్సవం చేయడం జరుగుతుందని తెలియజేశారు.

## కన్యకా పరమేశ్వరి కళింగ వైశ్య సంఘం సభ్యుల ఆత్మీయ కలయిక



-ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం జగన్

**గాజువాక :పెన్ పవర్ ,డిసెంబర్ 28** మహా విశాఖ నగర పాలక సంస్థ 87వ వార్డు పరిధిలో శ్రీ కన్యకా పరమేశ్వరి కళింగ వైశ్య సంఘం వారి ఆధ్వర్యంలో ఆత్మీయ కలయిక కార్యక్రమం ఏర్పాటు చేశారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి, స్థానిక వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఏడాదికి ఒకసారి సంఘం సభ్యులు కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మకి ఆత్మకలియ ఏర్పాటు చేయడం ఒక మంచి కార్యక్రమమని ఇంత మంచి కార్యక్రమంలో భాగస్వామ్యం చేసిన సంఘం సభ్యులకు ధన్యవాదములు తెలియజేసుకున్నారు.ఈ కార్యక్రమం లో వడ్లపూడి కన్యకా పరమేశ్వరి కళింగ వైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## సీలేరు బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతికి వార్డెన్, హెచ్ఎంల నిర్లక్ష్యమే కారణం?





* సీపీఐ కార్యకర్తల ఆరోపణ

**గూడెం కొత్త వీధి పెన్ పవర్ డిసెంబర్ 28:**జీకే వీధి మండలం సీలేరు బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న పాంగి.నిర్మల(11) ఆదివారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందిందని హాస్టల్ వెల్ఫేర్ అధికారిని నాగ శకుంతల తెలిపారు. నిర్మలకు శనివారం జ్వరంగా ఉండటంతో సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లామని,జ్వరం లేకపోయినప్పటికీ హిమోగ్లోబిన్ 4.5 శాతం ఉండటంతో రక్తం ఎక్కించాలని వైద్య సిబ్బంది సూచించారన్నారు. ఆదివారం ఉదయం పాఠశాలలో ఒక్కసారిగా నిర్మల పడిపోవడంతో వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లగా వైద్యాధికారి నారాయణరావు పరీక్షించి అప్పటికే నిర్మల మృతి చెందినట్లు నిర్ధారించారన్నారు. విద్యార్థిని మరణానికి ఆశ్రమ పాఠశాల వసతి గృహం వార్డెన్, హెచ్ఎం కారణంగా సీపీఐ మండల కార్యదర్శి భగవాన్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి దశరథ్, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు ఆరోపించారు. తల్లితండ్రులకు ముందస్తు సమాచారం ఇచ్చుంటే బాగుండేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ వ్యవహారంపై అధికారులు సమగ్ర విచారణ జరిపి వార్డెన్, హెచ్ఎంలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థి నిర్మల కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

## చోడిరాయి గ్రామంలో ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం




**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, డిసెంబర్ 28:**జీకే వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలోని చోడిరాయి గ్రామంలో జాతీయ కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు బుల్లిబాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కిల్లో సొన్ను ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం, స్వాతంత్ర్య ఉద్యమంలో పార్టీ పాత్ర, దేశ అభివృద్ధికి చేసిన సేవలపై వక్తలు ప్రసంగించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీలేరు, ధారకొండ, దుప్పులవాడ, గుమ్మిరేవుల పంచాయతీలకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే బీసీసెల్ కార్యదర్శి కారే శ్రీనివాస్, పూజారి బాబురావు, పోతురాజు మల్లుదొర, అల్లంగి రాజు తదితరులు హాజరయ్యారు.

## విజయవాడ అనాథాశ్రమంలో మనం సేవా సొసైటీ ట్రస్ట్ సేవా కార్యక్రమం



**చింతపల్లి పెన్ పవర్ డిసెంబర్ 28:-**మనం సేవా సొసైటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవాడలోని ఒక అనాథాశ్రమంలో సేవా కార్యక్రమాన్నివిజయవంతంగా నిర్వహించారు. ఈ ట్రస్ట్ వ్యవస్థాపకులు పెదిరెర్ల గౌతమ్ నరేంద్ర మహర్షి నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సేవా కార్యక్రమంలో భాగంగా అనాథ పిల్లలతో సమయం గడపడం, చెట్లను నాటడం, పిల్లలకు ఆటబొమ్మలు పంపిణీ చేయడం, భోజనం అందించడం, అలాగే పాడైపోయిన ఫర్నిచర్‌ను మరమ్మతులు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్‌లో చదువుతున్న మనం సేవా సొసైటీ ట్రస్ట్ సభ్యులు చురుకుగా పాల్గొని సేవా భావాన్ని చాటుకున్నారు.

పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.

## బాలిక మృతికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

* సీపీఎం పార్టీ గాలికొండ ఎంపీటీసీ అంపురంగి బుజ్జి బాబు

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,డిసెంబర్ 28:**జీకే వీధి మండలం సీలేరు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న నందిని అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని, ఆమె కుటుంబానికి తక్షణమే రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని సీపీఎం గాలికొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు.ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గాలికొండ పంచాయతీ గేజింగ్ గ్రామానికి చెందిన నందిని సీలేరు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యాభ్యాసం పొందుతోందని తెలిపారు. బాలిక మృతి చెందినట్లు సమాచారం అందగానే వెంటనే ఆశ్రమ పాఠశాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించానన్నారు.శనివారం నందిని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వార్డెన్ నాగశకుంతుల వెంటనే స్పందించి సీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు, చికిత్సలు అందించేందుకు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. వైద్య పరీక్షల్లో నందిని రక్తహీనతతో బాధపడుతున్నట్లు వైద్య సిబ్బంది గుర్తించారన్నారు.వార్డెన్ నాగశకుంతల విద్యార్థినుల బాగోగులను సక్రమంగా చూసుకుంటున్నారని, పాఠశాలలో ఎటువంటి సమస్యలు లేవని ఆయన స్పష్టం చేశారు. నందిని తండ్రి సుబ్బారావు నిరుపేద గిరిజన కుటుంబానికి చెందినవారని, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి నందిని కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

## శ్రీవేంకటేశ్వర స్వామి వారికి వెండి వస్తువుల సమర్పణ



**నర్సీపట్నం, పెన్ పవర్ (డిసెంబర్ 28) :**నర్సీపట్నం మండలం కొత్త బైపురెడ్డిపాలెం బ్రిడ్జి వద్ద వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారికి భక్తులు సమర్పించిన వెండి వస్తువులను ఆదివారం ఉదయం అలంకరించారు. ధనుర్మాసంలో భక్తులు సమర్పించిన కానుకలను స్వామివారికి అలంకరించడంతో స్థానికులు స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. స్వామివారికి సమర్పించిన శంఖు, చక్ర, కమల హస్తాలను, వక్ష స్థలమును భక్తులు ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయ అర్చకులు శేషాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మూలమూర్తులకు అలంకరించారు. ప్రముఖ దంత వైద్యులు బొంతు జగదీష్ బాబు శంఖ హస్తం, శ్రీశైలపు త్రినాధరావు చక్ర హస్తాన్ని, గ్రంధి నగేష్ కుటుంబసభ్యులు వక్షస్థలాన్ని సమర్పించగా, మరికొంతమంది సభ్యులు సమర్పించిన వెండితో కమల హస్తాన్ని ఆలయకమిటీ వారు తయారు చేయించారు. మోటమర్రి శ్రీధర్ కుటుంబసభ్యులు ఇత్తడి మకర తోరణాన్ని సమర్పించారు. ఈ వస్తువుల అలంకరణతో స్వామి వారు దేదీప్యమానంగా విరాజిల్లుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

## 48వ వార్డులో అభివృద్ధి పనులను పరిశీలించిన గంకల

* ఆదివారం అయినప్పటికీ స్థానికులతో కలిసి రోజంతా వార్డులోనే పర్యటనలో ఉన్న గంకల



**విశాఖ పెన్ పవర్ డిసెంబర్ 28:** జీవీఎంసీ 48వ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను 48వ వార్డు కార్పొరేటర్,బిజెపి ఫ్లోర్ లీడర్,స్టాండింగ్ కమిటీ మెంబర్ గంకల కవిత అప్పారావు యాదవ్ ఆదివారం స్థానికులతో కలిసి పరిశీలించారు. వార్డులో అభివృద్ధి పనులు జరగక ఇబ్బందులు పడుతున్నారని గంకల కవిత అప్పారావు యాదవ్ చేపట్టిన గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులు మేరకు జీవీఎంసీ కౌన్సిల్లో చర్చించి నిర్మాణాలు చేపతున్నామని గంకల పేర్కొన్నారు.ఈ సందర్భంగా అభివృద్ధి పనులను స్థానికులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఏఎస్ఆర్ నగర్ లో పర్యటించినప్పుడు డ్రైనేజీ సమస్య ఉందని ప్రజలు ద్వారా తెలుసుకొని డ్రైనేజీ సమస్యను పరిశీలించారు.డ్రైనేజీ లో పేరుకుపోయిన చెత్తను స్పెషల్ డ్రైవ్ పెట్టి తొలగిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా గంకల కవిత అప్పారావు యాదవ్ మాట్లాడుతూ 48వ వార్డు కొండవాలు ప్రాంతంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో వినతి పత్రాలు అందజేశారని,వినతి పై స్పందించి జీవీఎంసీ కౌన్సిల్ లో చర్చించి వార్డులో పేద ప్రజలకు అందుబాటులో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ఆదివారం అయ్యినప్పటికి ఉదయం నుంచి సాయంత్రం వరకు నేరుగా వార్డులో పర్యటన చేసి ప్రజలు నుంచి వినతులు స్వీకరించారు.వార్డు అభివృద్ధికి నిరంతరం కట్టుబడి ఉన్నామని గంకల తెలిపారు.ఏఎస్ఆర్ నగర్ లో డ్రైనేజీ సమస్య ఉందని డ్రైనేజీ లో పేరుకుపోయిన చెత్తను స్పెషల్ డ్రైవ్ పెట్టి తొలగిస్తామన్నారు.వార్డు ప్రజలకు ఏ సమస్య ఏర్పడిన తక్షణమే తనను సంప్రదించాలని గంకల పేర్కొన్నారు. వార్డు ప్రజల కోరిక మేరకు జీవీఎంసీ కౌన్సిల్లో చర్చించి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్న గంకల కవిత అప్పారావు యాదవ్ కు ఏఎస్ఆర్ నగర్ ప్రజలు అభినందనలు తెలిపారు.

# దేశంలో అత్యంత సంపన్నుడైన చెఫ్

**హైదరాబాద్ పెన్ పవర్:** చేసే చేతులను బట్టి వంటకాల రుచులు కూడా మారుతూ ఉంటాయిని చెప్పడం మీరు వినే ఉంటారు. అవును కొందరు చేసే వంటలు దానికి వాటి రుచినే మార్చేస్తాయి. అదే వారి చేతుల్లో ఉండే మ్యాజిక్.. ఈ మ్యాజిక్‌తోనే కొందరు కోట్లలో సంపాదిస్తున్నారు. అయితే మన దేశంలో అత్యంత సంపన్నుడైన చెఫ్ ఎవరో మీకు తెలుసా? అతని ఆస్తుల విలువ తెలిస్తే మీరు కచ్చితంగా షాక్ అవుతారు. మన దేశ ప్రత్యేక వంటకాలు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందినవి.. దేశ విదేశాలను నుంచి వచ్చిన పర్యాటకు ఇండియాలోని వంటకాలకు ఫిదా అయిపోతుంటారు. మన వంటకాల రుచులను ప్రపంచ వ్యాప్తంగా విస్తరించేందుకు ఎందరో చెఫ్‌లు కృషి చేశారు. దీంతో వారి వృత్తిలో ఎప్పికప్పుడూ కొత్త పుంతలను తొక్కుతూ వారు కోట్ల రూపాయలు సంపాదించారు. వీరి జాబితాలో వికాస్ ఖన్నా, కునాల్ కపూర్, రణవీర్ బ్రార్, హర్పాల్ సింగ్ సోఖి వంటి అనేక మంది చెఫ్‌లు ఉన్నప్పటికీ దేశంలోనే అత్యంత సంపన్నుడైన చెఫ్ విషయానికి వస్తే.. ఈ క్రెడిట్ మాత్రం కేవలం ఒకరికి మాత్రమే దక్కింది. భారతదేశంలో అత్యంత సంపన్నుడైన చెఫ్ ఎవరనే విషాయిని వస్తే.. ఆయనే సంజీవ్ కపూర్.. ఆయన నికర విలువ దాదాపు రూ.1,165 కోట్లు. హెూటల్ వంటగది నుండి ప్రపంచ స్థాయికి ఎదిగిన ఆయన ప్రయాణం భారతీయ ఆహార చరిత్రలో అత్యంత స్ఫూర్తిదాయకమైన విజయగాథలలో ఒకటిగా నిలుస్తోంది. 1993లో తొలిసారి ఆయన టెలివిజన్ షో ఖానా ఖజానా ద్వారా భారతీయ ప్రజలకు తన వంటకాల తయారీని చూపించడం స్టార్ట్ చేశారు. దాదాపు 17 సంవత్సరాల పాటు నడిచిన ఈ షోను ఆయనకు ప్రపంచ స్థాయి గుర్తింపును తెచ్చిపెట్టింది. ఆయన చెప్పే విధానం, స్పష్టమైన సూచనలు అన్ని వయసుల ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఇంట్లో వంటలు చేసే అడవారు ఆయన వంటలకు ఫ్యాన్స్ ఐపోయారు. సంజీవ్ కపూర్ విజయం ప్రస్థానం ఈ టీవీషో దగ్గర ఆగలేదు. తన గుర్తింపును



ఉపయోగించుకొని ఆయన ఓ బలమైన వ్యాపార సామ్రాజాన్ని స్థాపించారు. తనకు తెలిసిన వంటకాల గురించి సంవత్సరాలుగా, అతను 150 కి పైగా వంట పుస్తకాలను రాశాడు. వాటిని మార్కెట్‌లోకి తీసుకెళ్లాడు. దీంతో వాటికి ప్రజల నుంచి ఊహించని రెస్పాన్ వచ్చింది. ఆయన రాసిన బుక్స్‌లో చాలా వరకు బెస్ట్ సెల్లర్లుగా నిలిచాయి. ఇవే కాదు ఆయన సొంతగా కొన్ని రెస్టారెంట్‌లను సైతం స్థాపించాయి. ఇప్పుడు అవి ప్రపంచవ్యాప్తంగాను ప్రసిద్ధి చెందాయి. అయినా అతను వంటచేయడాన్ని మాత్రం ఆపలేదు. ఎన్నో ప్రపంచ వేదికలపై ఆయన తన ప్రతిభను కనబర్చాడు. వీటితో పాటు అగ్ర జాతీయ నాయకులు హాజరయ్యే అనేక అధికారిక విందుల్లో కూడా ఆయన వంటలు చేశారు. ఇది ఆయన స్థాయిని మరింత పైకి తీసుకెళ్లింది.. ఇలా వంటగదిలో ప్రారంభించిన ఆయన ప్రయాణం ప్రస్తుతం ప్రపంచాన్ని చుట్టేసింది.

# మీ ఇల్లే డేంజర్ జోన్! కొత్త స్టడీ షాకింగ్ రిపోర్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** చాలా మంది బయటికి వెళితేనే గాలి కాలుష్యం బారినపడతామని అనుకుంటారు. కానీ, కొత్త అధ్యయనం మాత్రం బయటి కంటే ఇంటిలోపలే ఎక్కువ గాలి కాలుష్యం జరుగుతోందని తేల్చింది. ఇందుకు పలు కారకాలను వెల్లడించింది. ఇంట్లోని గాలి నాణ్యతను పెంచుకునేందుకు పలు సూచనలు చేసింది. కాలుష్యం ఇప్పుడు ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఒకటి. బయటికి వెళితే వాహనాల నుంచి వెలువడే కాలుష్యం గాలి నాణ్యతను దెబ్బతీసి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. మరి ఇంట్లోనే ఉండి ఆరోగ్యంగా ఉందామనుకుంటే.. తాజా అధ్యయనం ఓ షాకింగ్ న్యూస్ చెప్పింది. బయటి గాలి కంటే సాధారణ ఇళ్లల్లో ఉండే గాలి మరింత కలుషితమైనదని పేర్కొంది. ఇంట్లోని గాలి కంటే బయటి గాలి కొంత మేలని తేల్చింది. వర్క్ హెూం, ఇంటి నుంచే ఆన్లైన్ క్లాసులు వినేవారు, ఎక్కువ సమయం ఇంట్లోనే గడిపేవారి ఆరోగ్యంపై ఈ కలుషిత గాలి చెడు ప్రభావం చూపుతుందని వెల్లడించింది. యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్హామ్ సైంటిస్టులు యూకేలోని మూడు నివాసాలను ఎంచుకుని లో కాస్ట్ సెన్సార్లను ఉపయోగించి గాలి నాణ్యతను పరిశీలించారు. వారి పరిశోధనలో ఆ ఇళ్లలోని గాలి నాణ్యత కంటే కూడా బయటి గాలి నాణ్యత కంటే మెరుగ్గా ఉందని తేలింది. ఇంట్లోని గాలిలో చాలా రకాల కలుషితాలు ఉన్నాయని పేర్కొంది. సాధారణ నివాసాల్లో ప్రజలు వారు చేసే రోజువారీ పనులు, సమీపంలోని రెస్టారెంట్ల నుంచి వచ్చే కలుషితాలు ఊపిరితిత్తులను దెబ్బతీస్తాయని అధ్యయనం వెల్లడించింది. బయటి నుంచి వచ్చే దుమ్మూధూళి కూడా ఇంట్లోకి వచ్చి గాలిని కలుషితం చేస్తాయి. వంటలు చేయడం వల్ల కూడా కొంత మేర కలుషితం ఇంట్లోనే ఉండిపోతుంది. శుభ్రపరిచే ఉత్పత్తులు, సెంట్ స్ప్రేలు, గ్రీన్ క్లీనర్లు కూడా గాలి కాలుష్యానికి కారణమవుతాయి. ఇలాంటి కాలుష్యం అధికమైతే క్యాన్సర్ లాంటి వ్యాధులు కూడా రావచ్చు. కిటికీలు మూసివేసి ఉంచినప్పుడు, ఎక్స్‌ట్రాక్ట్ ఫ్యాన్లు లేనప్పుడు కాలుష్య కారకాలు పేరుకుపోయే అవకాశం ఉంది.

ప్రజలు తమ సమయంలో 90 శాతం ఇంట్లోనే గడుపుతున్నారని గ్లోబల్ డేటా వెల్లడిస్తోంది. అంటే వాయు కాలుష్యానికి బయటి కంటే ఇంట్లో ఉండేవారే ఎక్కువ గురవుతున్నారు. ఎక్కువగా నివాసాల్లో ఉండే వృద్ధులు, పిల్లలు ఈ కాలుష్య కారకాలతో ఉబ్బసం, దీర్ఘకాలిక అబ్రస్ట్రక్టివ్ పల్మనరీ వ్యాధి, గుండె జబ్బులు, ఊపరితిత్తుల క్యాన్సర్ బారిన పడే అవకాశాలు కూడా ఉన్నాయని పలు హెల్త్ జర్నల్స్ పేర్కొన్నాయి. అయితే, ఇంట్లో కాలుష్యాన్ని తగ్గించుకునేందుకు పలు సూచనలు చేశారు నిపుణులు. వెంటిలేషన్‌ను మెరుగుపర్చుకోవడం, బయటి గాలు బాగున్నప్పుడు కిటికీలు తెరవడం, వంట చేసేటప్పుడు ఎక్స్ట్రాక్టర్ ఫ్యాన్లను ఉపయోగించడం వల్ల ఇంట్లోని కాలుష్యాన్ని క్రమంగా తగ్గించుకోవచ్చని బర్మింగ్హామ్ యూనివర్సిటీ అధ్యయనం వెల్లడించింది. పొగను విడుదల చేసే వాటిని తగ్గించాలని, ధూమపానం ఇంట్లో చేయకూడదన్నారు. అధిక కాలుష్య నగరాల్లో ఉన్నవారు ఇంట్లోని వస్తువులు, పరికరాలను తడిగుడ్డలతో శుభ్రం చేసుకోవాలని యార్క్ వర్సిటీ పరిశోధకులు చెప్పారు. బయట కాలుష్యం ఎక్కువగా సమయంలో కిటికీలను మూసి ఉంచాలని సూచించారు. ఇంటి లోపల గాలిని బయటి పొగమంచుతో పోలుస్తూ తీవ్రంగా పరిగణించాలని శాస్త్రవేత్తలు పిలుపునిస్తున్నారు. మనదేశంలోని బిట్స్ పిలాని, ఎన్ఐటీ వరంగల్, ఐఐటీ జోధ్‌పూర్ అభివృద్ధి చేసిన కొత్త ఇండోర్ గాలి నాణ్యత ఇండెక్స్ ప్రకారం ఇంటి బయటి గాలి కంటే రెండు నుంచి ఐదు రెట్లు ఎక్కువ కలుషితమవుతాయి. ఇంట్లోని కలుష్యాన్ని తగ్గించుకేనేందుకు తగిన చర్యలు తీసుకోవడంతోపాటు మెరుగైన వెంటిలేషన్ అవసరమని పేర్కొంది. ఇంట్లో ఎక్కువ సమయం ఉండేవారు ఆరోగ్యంగా ఉండాలనుకుంటే నిపుణుల సూచనలు పాటించాలని స్పష్టం చేసింది.

# డేటింగ్, పెళ్లికి ప్రభుత్వం డబ్బులిస్తోందా!

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుదల ఒక సమస్యగా మారుతుంటే, ఒక దేశంలో మాత్రం పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంది. అక్కడ జనాభా తగ్గిపోతుండటం ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది. యువత పెళ్లిళ్ల మీద ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుదల ఒక సమస్యగా మారుతుంటే, ఒక దేశంలో మాత్రం పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంది. అక్కడ జనాభా తగ్గిపోతుండటం ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది. యువత పెళ్లిళ్ల మీద ఆసక్తి చూపడం లేదు, అసలు డేటింగ్ అంటేనే భయపడుతున్నారు. దీంతో దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని గ్రహించిన అక్కడి ప్రభుత్వం ఒక వినూత్నమైన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఎవరైనా సరే డేటింగ్ మొదలుపెడితే చాలు వారికి నగదు బహుమతులు ఇస్తామని ప్రకటించింది. ఒకవేళ పెళ్లి చేసుకుంటే మరింత పెద్ద మొత్తంలో పారితోషికం, పిల్లల్ని కంటే ఏకంగా లక్షల్లో ప్రోత్సాహకాలు అందిస్తామని ఆఫర్ చేస్తోంది. ఇంతకీ ఆ దేశం ఏది? అక్కడ యువత ఎందుకు ఇలా తయారయ్యారు? ఈ వింతైన పరిస్థితులు ఎదుర్కొంటున్న దేశం మరెదో కాదు.. అది 'దక్షిణ కొరియా' . ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యల్ప జననాల రేటు నమోదవుతున్న దేశం ఇదే. ఇక్కడ జీవన వ్యయం విపరీతంగా పెరిగిపోవడం, ఉద్యోగాల్లో విపరీతమైన పోటీ ఉండటం వల్ల యువత పెళ్లి అనే బంధానికి దూరంగా ఉంటున్నారు. పెళ్లి చేసుకుంటే బాధ్యతలు పెరుగుతాయని, ఆర్థికంగా ఇబ్బందులు వస్తాయని వారు భావిస్తున్నారు. అందుకే ప్రభుత్వం జోక్యం చేసుకుని, ఒకరినొకరు కలుసుకోవడానికి ప్రోత్సహించడమే కాకుండా, పెళ్లి చేసుకున్న జంటలకు గృహ రుణాలు, ఇతర సౌకర్యాల్లో భారీ రాయితీలు ఇస్తోంది. కొన్ని నగరాల్లో అయితే డేటింగ్ కోసం ప్రత్యేకమైన ఈవెంట్లను కూడా ప్రభుత్వం నిర్వహిస్తోంది. దక్షిణ కొరియాలో జననాల రేటు ఎంతలా




పడిపోయిందంటే.. ఒక మహిళ తన జీవితకాలంలో కనే పిల్లల సగటు సంఖ్య 0.7 కంటే తక్కువకు చేరుకుంది. జనాభా స్థిరంగా ఉండాలంటే ఈ సంఖ్య కనీసం 2.1 ఉండాలి. పరిస్థితి ఇలాగే ఉంటే భవిష్యత్తులో దేశంలో వృద్ధుల సంఖ్య పెరిగిపోయి, పని చేసే యువత కరువయ్యే ప్రమాదం ఉంది. దీనిని అరికట్టడానికి ప్రభుత్వం 'బేబీ బోనస్' పథకాలను అమలు చేస్తోంది. బిడ్డ పుట్టినప్పటి నుంచి వారు పాఠశాలకు వెళ్లే వరకు ప్రతి నెలా కొంత నగదును తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేస్తోంది. అయినప్పటికీ అక్కడి యువత మాత్రం కెరీర్, స్వేచ్ఛకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. కేవలం ఆర్థిక పరమైన ఇబ్బందులే కాకుండా, సామాజిక కారణాలు కూడా ఈ పరిస్థితికి కారణమని నిపుణులు చెబుతున్నారు. కఠినమైన పని వేళలు, పిల్లల పెంపకానికి అయ్యే ఖర్చు, మారుతున్న ఆలోచనా విధానం వల్ల కొరియా యువత ఒంటరిగా ఉండటానికే ఇష్టపడుతున్నారు. ప్రభుత్వం ఎన్ని కోట్లు ఖర్చు చేసినా, యువత మనస్తత్వంలో మార్పు రాకపోవడం ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు అభివృద్ధిలో దూసుకుపోయిన ఈ ఆసియా టైగర్, ఇప్పుడు జనాభా సంక్షోభంతో కునారిల్లుతోంది. ప్రపంచంలోని ఇతర దేశాలకు కూడా ఇది ఒక హెచ్చరిక లాంటిదే అని విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తానికి ప్రేమకు, పెళ్లికి డబ్బు ఆశ చూపడం అనేది కొరియాలో ఒక అనివార్యమైన చర్యగా మారింది. మరి ప్రభుత్వం ఇస్తున్న ఈ ఆఫర్లను చూసి అయినా అక్కడి యువత తమ మనసు మార్చుకుంటారో లేదో చూడాలి.

## జామ పండ్లు వీరికి యమ డేంజర్!



**హైదరాబాద్ పెన్ పవర్:** శీతాకాలంలో లభించే సీజనల్ పండ్లలో జామపండ్లు ముందు వరుసలో ఉంటాయి. ఇవి రుచికి మాత్రమేకాదు ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. ఈ కాలంలో జామపండు సహజంగా పండి తాజాగా ఉంటాయి. దీంతో ఇందులో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. శీతాకాలంలో లభించే సీజనల్ పండ్లలో జామపండ్లు ముందు వరుసలో ఉంటాయి. ఇవి రుచికి మాత్రమేకాదు ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. ఈ కాలంలో జామపండు సహజంగా పండి తాజాగా ఉంటాయి. దీంతో ఇందులో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. జామ తినడం వల్ల రోగనిరోధక శక్తిని పెంచుతుంది. జలుబు, దగ్గును నివారిస్తుంది. జామకాయల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. జామకాయలో నీటి శాతం అధికంగా ఉంటుంది. ఇది నిర్జలీకరణాన్ని నివారిస్తుంది. ఎన్ని లాభాల ఉన్ననప్పటికీ కొంతమందికి శీతాకాలంలో జామ పండ్లు మేలు కంటే హాని ఎక్కువ తలపెడతాయి. అలాంటి వారు వీటికి దూరంగా ఉండటం మంచిది. జామపండులో ఫైబర్ అధికంగా ఉంటుంది. అందువల్ల వీటిని అధికంగా తింటే విరేచనాలు, కడుపు నొప్పిని పెంచుతుంది. ముఖ్యంగా చల్లగా ఉండే వాతావరణంలో జామపండు తినడం వల్ల గొంతులో అసౌకర్యం పెరుగుతుంది. అలాగే జీర్ణశక్తి తక్కువగా ఉన్నవారు జామపండును ఎక్కువగా తినకూడదు. ముఖ్యంగా సాయంత్రం లేదా రాత్రి సమయంలో జామపండ్లను అస్సలు తినకూడదు. కడుపులో గ్యాస్, అమ్లత్వంతో బాధపడేవారు కూడా ఎక్కువగా జామపండు తినకూడదు. ఈ సమస్య ఉన్నవారు జామ విత్తనాలను తొలగించి తినడం మంచిది. లేకుంటే కడుపు నొప్పి వస్తుంది. డయాబెటిస్ ఉన్నవారు కూడా జామపండ్లను ఎక్కువగా తినకూడదు. అలాగని పూర్తిగా మానేయకూడదు. మితంగా తినవచ్చు. ముఖ్యంగా మీకు ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వైద్యుడిని సంప్రదించిన తర్వాతే జామ పండ్లు తినాలి.

## మార్నింగ్ వాక్‌కు వెళ్తున్నారా..!



**హైదరాబాద్ పెన్ పవర్:** మండుటెండలైనా, చినుకులు పడుతున్నా లేదా గజగజ వణికించే చలికాలమైనా.. ఉదయం పూట నడక అనేది ఒక అద్భుతమైన వ్యాయామం. ప్రకృతి ఒడిలో, స్వచ్ఛమైన గాలి పీలుస్తూ నడవడం వల్ల మనసు ప్రశాంతంగా ఉండటమే కాకుండా ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. అయితే చాలామంది ఉత్సాహంగా నడకనైతే ప్రారంభిస్తారు కానీ తెలియక కొన్ని చిన్న తప్పులు చేస్తుంటారు. ఈ పొరపాట్లు మీ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. నీరు తాగకుండా వెళ్లడం: చాలామంది నిద్రలేవగానే ఏమీ తాగకుండానే వాకింగ్‌కు వెళ్తుంటారు. రాత్రంతా నిద్రపోవడం వల్ల ఉదయం సమయానికి మన శరీరం సహజంగానే కొంత డీహైడ్రేషన్‌కు గురై ఉంటుంది. ఈ స్థితిలో నీళ్లు తాగకుండా నడిస్తే కండరాల తిమ్మిర్లు, తలతిరగడం, తీవ్రమైన అలసట వస్తుంది. వాకింగ్‌కు వెళ్లడానికి 15-20 నిమిషాల ముందే కనీసం ఒక గ్లాసు గోరువెచ్చని నీటిని తాగడం అలవాటు చేసుకోండి. వార్మప్: నేరుగా నడక మొదలుపెట్టడం వల్ల కీళ్లు, కండరాలపై అదనపు ఒత్తిడి పడుతుంది. ముఖ్యంగా చలికాలంలో కండరాలు బిగుతుగా ఉంటాయి. వార్మప్ చేయకుండా నడిస్తే గాయాలయ్యే ప్రమాదం ఉంది. నడక ప్రారంభించే ముందు 2 నుండి 5 నిమిషాల పాటు చేతులు, కాళు ్ల, మెడను నెమ్మదిగా తిప్పుతూ తేలికపాటి సాగతీత వ్యాయామాలు చేయండి. ఖాళీ కడుపుతో కాఫీ తాగడం: తక్షణ శక్తి కోసం చాలామంది నడకకు ముందు కాఫీ తాగుతుంటారు. ఖాళీ కడుపుతో కెఫిన్ తీసుకోవడం వల్ల అసిడిటీ, గుండెల్లో మంట, ఆందోళన వంటి సమస్యలు తలెత్తుతాయి. ఒకవేళ మీకు ఏదైనా తీసుకోవాలనిపిస్తే.. ఒక అరటిపండు లేదా చిన్న అల్పాహారం తీసుకున్న తర్వాతే కాఫీ తాగడం మంచిది. కాలకృత్యాలు వాయిదా: నడకకు వెళ్లే ఉత్సాహంలో కొందరు టాయిలెట్‌కు వెళ్లడాన్ని వాయిదా వేస్తుంటారు. ఇది చాలా ప్రమాదకరమైన అలవాటు. దీనివల్ల కడుపులో అసౌకర్యం కలగడమే కాకుండా, మూత్ర నాళాల ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశం ఉంది. ఇంటి నుండి బయలుదేరే ముందే మీ ఉదయం పనులను పూర్తి చేసుకుంటే నడక హాయిగా సాగుతుంది. తప్పుడు పాదరక్షలు దుస్తులు: నడకకు తగిన షూస్ ధరించకపోవడం వల్ల పాదాల నొప్పి, వెన్నునొప్పి రావచ్చు. అలాగే వాతావరణానికి తగినట్లుగా గాలి ఆడే దుస్తులను ఎంచుకోవడం ఉత్తమం.ఆరోగ్యం కోసం చేసే నడక సురక్షితంగా ఉండాలి. పైన పేర్కొన్న చిన్న చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా మీరు పూర్తి స్థాయి ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

## చలికాలంలో అరటి పండ్లు తినడం మంచిదేనా?



**హైదరాబాద్ పెన్ పవర్:** శీతాకాలంలో ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. ఈ కాలంలో అనేక ఆరోగ్య సమస్యలు చుట్టూ ముడతాయి. అందుకే ఈ కాలంలో తీసుకునే ఆహారంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ క్రమంలో చాలా మందికి శీతాకాలంలో అరటిపండ్లు తినాలా? శీతాకాలంలో ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. ఈ కాలంలో అనేక ఆరోగ్య సమస్యలు చుట్టూ ముడతాయి. అందుకే ఈ కాలంలో తీసుకునే ఆహారంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ క్రమంలో చాలా మందికి శీతాకాలంలో అరటిపండ్లు తినాలా? వద్దా? అనే సందేహం కలుగుతుంది. నిజానికి అరటిపండ్లు తినడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అరటిపండ్లు తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తొలగిపోతాయి. అరటిపండ్లు పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరికీ ప్రయోజనకరంగా ఉంటాయి. అరటిపండ్లలో పోషకాలు పుష్కలంగా ఉండటమే అందుకు కారణం. అయితే శీతాకాలంలో అరటిపండ్లు తినడం ప్రయోజనకరంగా ఉందా? లేదా? అనే సందేహం చాలా మందికి ఉంటుంది. ఎందుకంటే చలికాలంలో అరటిపండ్లు తినడం వల్ల జలుబు, దగ్గు వస్తుందని పలువురి నమ్మకం. నిపుణుల అభిప్రాయం ప్రకారం శీతాకాలంలో వీలైనంత వరకు అరటిపండ్లు తినడం మానుకోవాలి. అరటిపండ్లు తినడం మరింత చలిని కలిగిస్తాయి. చల్లని వాతావరణంలో అరటి ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి. ముఖ్యంగా జలుబు వచ్చే అవకాశం ఎక్కువ. అరటిపండ్లు తినాలని అనిపిస్తే మధ్యాహ్నం వేళల్లో తినడం మంచిది. శీతాకాలంలో రాత్రి, ఉదయం వేళల్లో అరటిపండ్లు తినకపోవడమే మంచిది. ఎందుకంటే ఈ సమయాల్లో అరటి పండ్లు తినడం వల్ల జలుబు, దగ్గు వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువ.

## అవన్నీ పుకార్లే.. గంభీరే ఉంటాడు: టెస్ట్ కోచ్ మార్పు వార్తలపై తెగేసి చెప్పిన BCCI



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత టెస్ట్ కోచ్ పదవి నుంచి గౌతమ్ గంభీర్‌ను తొలగించనున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కోచ్ మార్పు వార్తలపై భారత క్రికెట్ నియంత్రణ బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా స్పందించారు. టెస్ట్ కోచ్‌గా గంభీర్‌ను తొలగిస్తారని జరుగుతోన్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. అవన్నీ ఒట్టి పుకార్లేనని క్లారిటీ ఇచ్చారు. రెడ్-బాల్ కోచింగ్ సెటప్‌లో మార్పు గురించి బీసీసీఐ ఎటువంటి చర్చలు జరపలేదని తెలిపారు. ఒప్పందం ప్రకారం 2027 వన్డే వరల్డ్ కప్ వరకు టీమిండియా హెడ్ కోచ్‌గా గంభీర్ కొనసాగుతాడని తేల్చిచెప్పారు. టెస్ట్ కోచ్ కోసం గంభీర్ స్థానంలో బీసీసీఐ ఎవరినీ సంప్రదించలేదని వివరించారు. కాగా, స్వదేశంలో న్యూజిలాండ్, సౌతాఫ్రికాతో టెస్ట్ సిరీస్ ఓటమి నేపథ్యంలో రెడ్ బాల్ కోచ్ పదవి నుంచి గంభీర్?ను తొలగించాలని
బీసీసీఐ భావిస్తోన్నట్లు క్రీడా వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. గంభీర్ స్థానంలో తెలుగు క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్‌ను టెస్ట్ కోచ్‌గా నియమించనున్నారని పెద్ద ఎత్తున ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో కోచ్ మార్పు వార్తలు పుకార్లేనని బీసీసీఐ కార్యదర్శి క్లారిటీ ఇవ్వడంతో ప్రచారానికి చెక్ పడింది. టెస్ట్ కోచ్‌గా గంభీర్ భవిష్యత్తుపై నెలకొన్న ఊహాగానాలకు ఎండ్ కార్డ్ పడింది.

## సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్: ఫైనల్లో సాత్విక్ - రాధిక

**హైదరాబాద్ పెన్ పవర్:** సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ షట్లర్ సాత్విక్ రెడ్డి.. - రాధిక శర్మతో మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్ చేరి టైటిల్ ముంగిట నిలిచాడు. సెమీఫైనల్లో రెండో సీడ్ సాత్విక్ (తెలంగాణ) - రాధిక (పంజాబ్) జోడీ 21- 13, 21- 14తో నితిన్ కుమార్- కనిక కన్వాల్‌ను ఓడించింది. మరో మ్యాచ్‌లో టాప్ సీడ్ అషిత్ సూర్య- అమృత ద్వయం 8-- 21, 21--18, 21-18తో దీప్ రాంభీయ- - సోనాలి మిర్కెల్కర్‌పై గెలిచింది.
విమెన్స్ సింగిల్స్ సెమీస్‌లో లోకల్ ప్లేయర్ తామిరి సూర్య చరిష్మ 21- 18, 18--21, 21-%-9 తో 45వ ర్యాంకర్ రక్షిత శ్రీ (తమిళనాడు)ని, తన్వీ పత్రి 18--21, 21--12, 21--15తో శృతి ముందడ (మహారాష్ట్ర)ను ఓడించి ఫైనల్ చేరారు. మెన్స్ సింగిల్స్‌లో ఒడిశా మాస్టర్స్ విజేత రిత్విక్ (తమిళనాడు) ఓ మ్యాచ్ పాయింట్‌ను కాపాడుకుని 21--16, 17--21, 22-20తో టాప్ సీడ్ కిరణ్ జార్జ్‌ను ఓడించాడు . మరో మ్యాచ్‌లో భరత్ రాఘవ్ 21--17, 11--21, 21-%-11తో తెలంగాణ ప్లేయర్, రెండో సీడ్ మన్నేపల్లి తరుణ్‌కు షాకిచ్చాడు. విమెన్స్ డబుల్స్‌లో శిఖ గౌతమ్ - అశ్విని భట్, ప్రియా దేవి- శృతి మిశ్రా జోడీలు ఫైనల్లో అడుగు పెట్టాయి.

# టీమిండియా వన్డే జట్టులో భారీ మార్పులు: రిషభ్ పంత్‌పై వేటు.. కిషన్‌కు పిలుపు?

**న్యూజిలాండ్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు పంత్ దూరం!**
**దేశవాళీ క్రికెట్‌లో దుమ్మురేపుతున్న ఇషాన్ కిషన్‌కు దక్కనున్న అవకాశం**
**గాయం నుంచి కోలుకుని మళ్లీ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనున్న శుభ్‌మన్ గిల్**

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత వన్డే జట్టులో కీలక మార్పులకు రంగం సిద్ధమైంది. న్యూజిలాండ్‌తో స్వదేశంలో జరగనున్న మూడు వన్డేల సిరీస్ నుంచి స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్‌ను తప్పించనున్నట్లు తెలుస్తోంది. 2025%-%26 సీజన్‌లో టీమ్ ఇండియా ఆడబోయే ఆఖరి హోమ్ సిరీస్ కోసం ఫామ్, జట్టు సమతుల్యతను దృష్టిలో ఉంచుకుని సెలెక్టర్లు ఈ కఠిన నిర్ణయం తీసుకోబోతున్నట్లు సమాచారం.రిషబ్ పంత్ స్థానంలో జార?ండ్ డైనమో ఇషాన్ కిషన్‌ను జట్టులోకి తీసుకోవాలని సెలెక్షన్ కమిటీ భావిస్తోంది. రెండేళ్లుగా వన్డేలకు దూరంగా ఉన్న కిషన్ ప్రస్తుతం దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో అత్యధిక పరుగులు చేయడమే కాకుండా, విజయ్ హజారే ట్రోఫీలో కేవలం 33 బంతుల్లోనే సెంచరీ బాది సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. ఈ అద్భుత ప్రదర్శనే అతడిని తిరిగి వన్డే జట్టులోకి చేర్చేలా కనిపిస్తోంది.మెడ గాయం కారణంగా దక్షిణాఫ్రికా సిరీస్‌కు దూరమైన శుభ్‌మన్ గిల్ ఇప్పుడు పూర్తి ఫిట్‌నెస్ సాధించి కెప్టెన్‌గా తిరిగి రానున్నాడు. గిల్ గైర్హాజరీలో కేఎల్ రాహుల్ నాయకత్వంలో భారత్ 2%-%1తో దక్షిణాఫ్రికాపై సిరీస్ నెగ్గింది. ఇప్పుడు గిల్ రావడంతో టాప్ ఆర్డర్ మరింత బలోపేతం కానుంది. మరోవైపు వైస్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ శిక్షణ మొదలుపెట్టినప్పటికీ, అతడికి ఇంకా పూర్తి క్లియరెన్స్ లభించలేదు.రిషభ్ పంత్ చివరిసారిగా 2024 ఆగస్టులో శ్రీలంకపై వన్డే ఆడాడు. ఆ తర్వాత



దక్షిణాఫ్రికా పర్యటనలో జట్టులో ఉన్నప్పటికీ ఆడే అవకాశం రాలేదు. ప్రస్తుతం విజయ్ హజారే ట్రోఫీలో ఢిల్లీ జట్టుకు నాయకత్వం వహిస్తున్న పంత్ అక్కడ కూడా ఆశించిన స్థాయిలో రాణించడం లేదు (తొలి రెండు మ్యాచుల్లో 5, 70 పరుగులు). దీంతో ప్రస్తుతానికి పంత్‌ను పక్కనపెట్టి, జోరుమీదున్న ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలని బీసీసీఐ భావిస్తోంది.


## త్వరలో టీ20 ప్రపంచ కప్.. పాక్ జట్టు నుంచి సూపర్ స్టార్లు ఔట్



**హైదరాబాద్ పెన్ పవర్:** 2026 టీ20 ప్రపంచ కప్‌నకు సన్నాహకంగా జనవరి 7 నుంచి శ్రీలంకతో పాక్ మూడు టీ20ల సిరీస్‌లో తలపడనుంది. ఈ మ్యాచ్‌ల కోసం పాక్ సీనియర్ సెలక్షన్ కమిటీ 15మందితో జట్టును ప్రకటించింది. ఆస్ట్రేలియాలో జరుగుతున్న బిగ్‌బాష్ లీగ్‌లో ఆడుతున్న స్టార్ ఆటగాళ్లు బాబర్ అజామ్, షాహీన్ అఫ్రిది, హారిస్ రవూఫ్, మహ్మద్ రిజ్వాన్‌లను లంకతో సిరీస్‌కు ఎంపిక చేయలేదు. అన్‌క్యాప్‌డ్ వికెట్‌కీపర్ ఖవాజా నఫేను తొలిసారి జాతీయ జట్టులోకి తీసుకున్నారు.కుడిచేతి వాటం బ్యాటర్ అయిన నఫే ఇటీవల పాకిస్థాన్ షహీన్స్ జట్టులో భాగమయ్యాడు. ఈ కుర్రాడు ఇప్పటి వరకు 32 టీ20లు ఆడి 132.81 స్ట్రైక్‌రేట్‌తో 688 పరుగులు చేశాడు. ఆల్‌రౌండర్ షాదాబ్ ఖాన్ తిరిగి టీ20 జట్టులోకి వచ్చాడు. సల్మాన్ అఘా కెప్టెన్‌గా కొనసాగనున్నాడు. శ్రీలంకతో టీ20 సిరీస్ ఆడే జట్టు ప్రదర్శన ఆధారంగా ప్రపంచ కప్‌నకు పాకిస్థాన్ టీమ్‌ను ఖరారు చేసుకునేందుకు అవకాశం దొరుకుతుంది. ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభంకానున్న టీ20 ప్రపంచ కప్‌లో గ్రూప్ బిలో భారత్, పాక్, నమీబియా, నెదర్లాండ్స్, యూఎస్‌ఏ ఉన్నాయి.
పాకిస్థాన్ మ్యాచ్‌లు కొలంబోలో జరుగుతాయి.శ్రీలంకతో సిరీస్‌కు పాక్ జట్టు: సల్మాన్ అలీ అఘా (కెప్టెన్), అబ్దుల్ సమద్, అబ్రార్ అహ్మద్, ఫహీమ్ అష్రఫ్, ఫకార్ జమాన్, ఖవాజా నఫే, మహ్మద్ నవాజ్, మహ్మద్ సల్మాన్ మీర్జా, మహ్మద్ వసీం జూనియర్, నసీమ్ షా, సాహిబ్‌జాదా ఫర్హాన్, సైమ్ అయూబ్, షాదాబ్ ఖాన్, ఉస్మాన్ ఖాన్, ఉస్మాన్ తరీక్.

# రచయితలకు రష్మిక సరెండర్!





నేషనల్ క్రష్ రష్మికా మందన్నా కెరీర్ పాన్ ఇండియాలో దేదీప్య మానంగా సాగిపోతున్నసంగతి తెలిసిందే. తెలుగు, హిందీ సినిమాలతో బిజీ బిజీగా గడుపుతోంది. ఈ మధ్యనే లేడీ ఓరియేంటెడ్ చిత్రాలు కూడా ప్రారంభించింది. ఇప్పటికే -ది గర్ల్ ఫ్రెండ్- తో ప్రేక్షకుల్ని అలరించింది. త్వరలో -మైసా-తో మెస్మరైజ్ చేయడానికి రెడీ అవుతుంది. ఈ సినిమా కూడా సక్సెస్ అయితే రష్మిక ఇమేజ్ అంతకంతకు రెట్టింపు అవుతుంది. ప్రస్తుతం రష్మిక కొత్త ప్రాజెక్ట్ ల విషయంలో ఆచితూచి అడుగులు వేస్తోంది. కథా బలంతో పాటు, పాత్రలకు ప్రాధాన్యత ఉంటేనే కమిట్ అవుతుంది.పాన్ ఇండియా ఇమేజ్ పై ఎలాంటి ప్రభావం పడకూడదు? అన్న జాగ్రత్తతో తెలివైన నిర్ణయాలు తీసుకుంటుంది. ఈ విషయంలో తనకంటే ఎక్కువగా దర్శక, రచయితల్నే నమ్ముతున్నట్లు కనిపిస్తుంది. తాజాగా రష్మిక దర్శకుల్ని ఎంతగా నమ్ముతుంది? అన్నది రివీల్ చేసింది. తానొక నటినని, ఎంటర్ టైనర్ అనే విషయం నిరంతరం మైండ్ లో పెట్టుకునే పని చేస్తానంది. ఒకే ఇమేజ్ కు పరిమితం కాకుండా సినిమాలు చేయాలనుకుంటానంది. తనలోని విభిన్న వ్యక్తిత్వాలు, కోణాలను అన్వేషించాలనుకుంటానంది. పాత్రల పరంగా తనని కేవలం మంచి అమ్మాయిగా, అమాయకపు అమ్మాయిగా, సరదా, చెడ్డ మహిళగా చూడకూడదనే కోరుకుంటానంది.ప్రేక్షకులు గుర్తించడం కోసం ఎలాంటి పాత్రలకైనా తానెప్పుడు సిద్దంగా ఉంటానంది. తనని నమ్మి దర్శక, రచయి తలు రాసే పాత్రల విషయంలో తనకన్నా ఎక్కువగా వాళ్లనే నమ్ముతానంది.

వాళ్ల ఆలోచనకు తగ్గట్టు నటించా లని..అందు కోసం ఎంత మాత్రం వెనుకడుగు వేయనంది. తనకు నచ్చితే, నమ్మకంగా అనిపిస్తే దర్శక, రచ యితలకు పూర్తిగా సరెండర్ అయిపోతానంది. అలాగే తాను కేవలం ఒకే భాషకు ఎన్నడు పరిమితం కాదని క్లారిటీ ఇచ్చింది. కథలు నచ్చితే భాషతో పని లేకుండా ఏ భాషలో నటించడానికైనా సిద్దంగా ఉంటానంది.తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, మలయాళం ఏ పరిశ్రమను తేలికగా తీసుకోనంది. ఏ భాషలో సినిమా చేస్తున్నా ఆ భాషకు అంకితమై పని చేస్తానంది. ఇంత వరకూ అయిష్టంగా ఏ సినిమాకు పని చేయలేదంది. భారతీయ చిత్ర పరిశ్రమలో గొప్ప ప్రయాణం సాధ్యమైందంటే? కారణం అన్ని భాషలు తనని ఆదరించడంతోనేని కృతజ్ఞతలు తెలిపింది. ప్రస్తుతం బాలీవుడ్ లో -కాక్ టెయిల్ 2- లో నటిస్తోంది. తెలుగులో -మైసా- అనే లేడీ ఓరియేంటెడ్ చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాపై మంచి అంచనాలున్నాయి. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలు సినిమాకు ఊహించని హైప్ తీసుకొచ్చాయి.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com